# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :80 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 25-05-2025 పేజీలు:4 వెల: 2.00


## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టుల మృతి

రాంచీ,మే24: జార్ఖండ్‌లోని లటేహర్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. శనివారం తెల్లవారుజామున భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందినవారు మావోయిస్టు పార్టీ చీలిక వర్గమైన జార్ఖండ్ జన ముక్తి పరిషత్ చీఫ్ పప్పు లోహరా, ప్రభాత్ గంఝూగా గుర్తించారు. పప్పుపై రూ. 10 లక్షలు, ప్రభాత్‌పై రూ. 5 లక్షల చొప్పున రివార్డు ఉన్నదని పోలీసులు తెలిపారు. అయితే ఈ కాల్పుల్లో మరో వ్యక్తికి గాయలవ్వగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో మరో సైనికుడికి కూడా బుల్లెట్ గాయం అయింది. అతన్ని చికిత్స కోసం రాంచీలోని ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఆపరేషన్ మొత్తం జార్ఖండ్ డిజిపి అనురాగ్ గుప్తా మార్గదర్శకత్వంలో జరిగింది.

## ఎవరా దయ్యాలు..ఏమిటా రహస్యం



హైదరాబాద్,మే24:కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ కొన్ని దయ్యాలు ఉన్నాయి. వాళ్ల వల్ల చాలా నష్టం జరుగుతోందని ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బిఆర్ఎస్ రాజకీయాల్లో సంచలనంగా మారాయి. కవిత తాను లేఖ రాసానని ఒప్పుకున్నారు. ఈ లేఖ బిఆర్ఎస్ అంతర్గత రాజకీయాలకే సంబంధించింది తప్ప మరోటి కాదు. తెలంగాణ రాజకీయాలతో దీనికి ఎలాంటి సంబంధంలేదు. బిఆర్ఎస్‌లో జరుగుతున్న నిరంకుశ విధానాలను ఎండగట్టే లక్ష్యంతో కవిత ఈ లేఖ రాసారని అర్థం అవుతోంది. ఇక దయ్యాలు అంటే ఎవరన్న చర్చ అప్పుడే మొదలయ్యింది. కుట్రలు చేస్తున్న ఆ దయ్యాలే.. తన తండ్రికి తాను రాసిన లేఖను లీక్ చేశాయని.. పార్టీలో తనపై అంతర్గతంగా కుట్రలు జరుగుతున్నాయని కవితఆరోపించారు. నిజంగానే కవిత అంటే పడని వారు ఎవరు. పార్టీని గుప్పిట పెట్టుకుని నడిపిస్తున్నది ఆమె సొంత అన్ననే. ఆమనే పెత్తనం చలాయిస్తున్నారు. తరవాత హరీష్ రావు ఉన్నారు. ఆ తరవాత ఒకరిద్దరు ఉన్నా..వారు పార్టీని ప్రభావితం చేసే స్థాయిలో లేరు. దయ్యాలంటే ఈ ఇద్దరేనా అన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు కూడా ఇదే కరెక్ట్ అని వ్యాఖ్యానిస్తున్నారు. అన్న కెటిఆర్‌తో కవికు పొసగడం లేదని అంటున్నారు. అమెరికా నుంచి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్న కవిత. ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు. తాను తన కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకకు హాజరై తిరిగి వచ్చేసరికి.. లేఖ లీక్ అయ్యిందంటూ హంగామా జరుగుతోందని, ఆ లేఖ రెండు వారాల క్రితం కేసీఆర్‌కు తాను రాసిందేనని స్పష్టత ఇచ్చారు. గతంలో కూడా కేసీఆర్‌కు తన అభిప్రాయాలను ఇలా లేఖ ద్వారా చెప్పానని కూడా ఆమె పేర్కొన్నారు. ఆనటి లేఖ ఇప్పటి వరకు బహిర్గతంకాలేదు. ఇప్పుడే ఎందుకు బహిర్గతం అయ్యిందన్న వాదనా ఉంది. లేదా డవర్షన్ పాలిట్రిక్స్‌లో భాగామా అన్న చర్చ కూడా సాగుతోంది. ఇకపోతే వరంగల్ సభ తరువాత లేఖ ద్వారా తన అభిప్రాయాలను పార్టీ అధినేతకు వెల్లడించానని.. కేసీఆర్‌కు లేఖ రాయడంలో తనకు ఎలాంటి వ్యక్తిగతఎజెండా లేదని ఆమెస్పష్టం చేశారు. తండ్రితో చనువు ఉన్న కవిత వివరాలు నేరుగా చెప్పకుండా లేఖ రాయాల్సిన అసవర ఏముందన్నదే అసలు ప్రశ్న. ఇందులో ఏదో తిరకాసు లేకుంటే లేఖ రాయాల్సిన అవసరమేముంటుంది. పార్టీలో అన్ని స్థాయిల్లో ఉన్న వారూ అనుకునే విషయాలు, దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటున్న విషయాలను మాత్రమే తాను లేఖలో రాశానని చెప్పారు. నేను కేసీఆర్‌కు లేఖలు రాయడం కొత్తేమీ కాదు. ఆయనకు తరచుగా సమాచారం (ఇస్తాను. నేను లేఖ ద్వారా వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో ప్రత్యేకత ఏమీ లేదని ఆమె తేల్చిచెప్పారు. కానీ, ఈసారి తాను రాసిన లేఖ బయటికి రావడం బాధాకరమన్నారు. తనకు వ్యక్తిగతంగా ఎవరిపైనా ద్వేషంగానీ ప్రేమగానీ లేవని ఆమె పేర్కొన్నారు. అయితే, తన తండ్రికి తాను అంతర్గతంగా రాసిన లేఖ బహిర్గతమైందంటే.. దాని వెనుక ఎవరున్నారనే విషయాన్ని పార్టీనాయకులు, తెలంగాణ ప్రజలు అందరూ ఆలోచించాలని.. దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని కవిత అభిప్రాయ పడ్డారు. నిజానికి ఇది అంతర్గ విషయమైనప్పుడు చర్చ ఎందుకో అర్థ కాదు. కేసీఆర్ కుమార్తైనైన నేను రాసిన లేఖే బయటికి వచ్చిందంటే.. ఇక సామాన్యుల సంగతేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ వ్యవహారాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో తనపై అంతర్గత కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయన్న విషయాన్ని తాను ఇటీవలే బహిరంగంగానే చెప్పానని గుర్తుచేశారు. మొత్తంగా ఇప్పుడు దయ్యాలెవరో కవితకే తెలుసు. పార్టీకి సంబంధించిన ముఖ్యంగా కుటుంబానికి సంబంధించిన విషయాలను రచ్చ చేసి ఏ రకమైన రాజకీయ లబ్ది ఆశిస్తున్నారన్నది తెలియాలి.

## మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది

హైదరాబాద్,మే24: పార్టీ అధినేతకు సూచనలు చేయాలనుకుంటే లేఖలు రాయవచ్చునని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత లేఖపై కెటిఆర్ స్పందించారు. అంతర్గతంగా మాట్లాడే అంశాలు బయట మాట్లాడటం సరికాదని, పార్టీలో అందరం కార్యకర్తలమే..ఇది అందరికీ వర్తిస్తుందని చెప్పారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, కోవర్టులు సమయం వచ్చినప్పుడు వారే బయటపడతారని పేర్కొన్నారు. అన్ని పార్టీల్లోనూ కోవర్టులు ఉంటారని, తమ పార్టీలోనూ సిఎం రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చునని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు పెట్టాం.. అసెంబ్లీలో ఓడిపోయాం.. ఎలా ముందుకు పోవాలని 17 రోజుల పాటు- వేల మంది కార్యకర్తలతో చర్చించాం. ఆ ప్రాసెస్‌లో చాలా మంది డైరెక్ట్‌గా మైక్‌లో మాట్లాడిన వారు ఉన్నారు. కొంత మంది చిట్టీల మీద రాసిచ్చిన వారు ఉన్నారు. కొంత మంది కేసీఆర్‌కు ఉత్తరం అందించండి అని ఉత్తరాలు ఇచ్చిన వారు ఉన్నారు. మా పార్టీలో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉంది. మా పార్టీ అధ్యక్షుడికి ఏవైనా సూచనలు చేయాలను కుంటే ఉత్తరాలు రాయొచ్చు. మా పార్టీలో డెమోక్రసీ ఉంది కాబట్టి.. సూచనలు సలహాలు చేస్తూ అధ్యక్షుడికి లిఖిత పూర్వకంగా, ఓరల్‌గా ఇవ్వొచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీలో ఏ హోదాలో ఉన్నా.. అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటది. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంది.. ఆఫీస్ బేరర్స్ ఉన్నారు.. వారిని కూడా కలిసే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని విషయాలు అంతర్గతంగానే మాట్లాడితే బాగుంటు-ంది.. ఇది అందరికీ వర్తిస్తుంది. అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారు.. అందులో రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చు అని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ అని,దెయ్యం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. హైకమాండ్ కు డబ్బులిస్తూ రేవంత్ పదవి కాపాడుకుంటున్నారని, ఇడి ఛార్జ్‌షీట్‌లో పేరున్న రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. నాడు ఓటుకు



నోటు స్కామ్.. ఇది సీటుకు రూటు- స్కామ్ అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. నైతికత ఉంటే ముఖ్యమంత్రి స్వచ్ఛందం గా తప్పుకోవాలని, ఆయన తప్పుకోకుంటే అధిష్టానం తొలగించాలని సూచించారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి కాదని, మూటల మనిషి అని చురకలంటించారు. రేవంత్ దిల్లీ వెళ్లి చీకట్లో బిజెపి నేతల కాళ్లు పట్టుకుంటున్నారని, అమిత్ షాను రాత్రి కలిసిన రేవంత్ బయటికొచ్చిగట్టిగా మాట్లాడారని మండిపడ్డారు. నిందలు, దందాలు, చందాలు ఇదే రేవంత్ పని అని విమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ పై నిందలు, కాంట్రాక్టర్లతో దందాలు, దిల్లీకి చందాలు అని కెటిఆర్ దుయ్యబట్టారు. బిజెపి ఎంపిల భూదందాలకు సిఎం వత్తాసు పలుకుతున్నారని, బిజెపి నేతలు రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. అందుకే నేషనల్ హెరాల్డ్ కేసుపై నేతలు మాట్లాడట్లేదని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే అన్ని అంశాలపై కేంద్రం చర్య తీసుకోవాలని కెటిఆర్ కోరారు. కేంద్రం స్పందన కోసం నెలరోజులు ఎదురు చూస్తామని, నెల తర్వాత పార్టీలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తాం అని కెటిఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్.. దయ్యం రేవంత్ రెడ్డి.. ఈ దయ్యాన్ని, శనిని ఎలా వదిలించాలనేది మా టార్గెట్‌అన్నారు.

## గోదావరి జలాలను ఎత్తుకుపోతుంటే చూస్తారా?

హైదరాబాద్,మే24: తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ, గోదావరి జలాలను ఎత్తుకు పోయేందుకు ఏపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఏం చేస్తున్నట్లని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 80 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం 50శాతం నిధులు, మిగతా 50శాతం ఎఫ్ఆర్‌బీఎం పరిధి మించి రుణ సమీకరణకు ఏపీకి అనుమతించడం అన్యాయం, అనైతికం అని హరీశ్‌రావు మండిపడ్డారు. విభజన చట్టం ప్రకారం, కృష్ణా లేదా గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టులు నిర్మించాలనుకుంటే రివర్ మేనజ్మెంట్ బోర్డుల అనుమతి అవసరం. కానీ అందుకు విరుద్ధంగా, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే అడ్డుకోవాల్సిన కేంద్రం, నిధులిచ్చి సహకరించడం దుర్మార్గం అన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న తీవ్ర అన్యాయం అన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి ఏం లాభమని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకుంటే, ఎఫ్ఆర్‌బీఎం కింద రికవరీ పెట్టారు, కానీ బనకచర్ల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా 50శాతం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి మించి రుణం తీసుకునేందుకు పర్మిషన్ ఇచ్చారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ, ఆంధ్రప్రదేశ్‌పై వరాల జల్లులు కురిపిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే



ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. నాటి సమైక్య పాలకులు పోతిరెడ్డిపాడుతో కృష్ణా జలాల అక్రమ తరలింపుకు ప్రణాళిక వేస్తే, నేటి కాంగ్రెస్ నాయకుల సమక్షంలోనే బనకచర్ల ద్వారా గోదావరి జలాల దోపిడికి మార్గం సుగమం చేస్తున్నారు. కేంద్రాన్ని నిలదీయలేరు, ఏపీతో పోరాటం చేయలేరు. చేతగాని ప్రభుత్వం వల్ల తెలంగాణ నష్టపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టుగా మారాయి. నీతి అయోగ్ సమావేశానికి హాజరవుతున్న ముఖ్యమంత్రి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించి, ఏపీ జల దోపిడిని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కాశ్మీర్‌లో యుద్ధ బాధిత కుటుంబాలకు రాహుల్‌గాంధీ పరామర్శ



జమ్మూ కాశ్మీర్: కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జమ్మూకాశ్మీర్‌లో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఇటీవల భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల సందర్భంగా పూంఛ్ ప్రాంతంలో ఆస్తులు కోల్పోయిన బాధిత కుటుంబాలను రాహుల్‌గాంధీ పరామర్శించారు.వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.దాయాది దేశం సరిహద్దు గ్రామాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. దాయాది సైనిక చర్యలకు జమ్మూకాశ్మీర్‌లోని సరిహద్దు గ్రామాలు దెబ్బతిన్నాయి. దీంతో పూంఛ్ ప్రాంతంలో అనేక నివాసాలు దెబ్బతిన్నాయి. ఒక పాఠశాలకు రాహుల్‌గాంధీ వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత జమ్మూకాశ్మీర్‌ను సందర్శించారు. ఇక ఆపరేషన్ సిందూర్ తర్వాత మరొకసారి ఈ ప్రాంతాన్ని సందర్శించడం విశేషం.ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది చనిపోయారు. అనంతరం భారత్.. ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీంతో పాకిస్థాన్‌లో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. ఇక పాకిస్థాన్‌కు సింధు జలాలను భారత్ నిలిపివేసింది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుండడంతో ప్రశాంత వాతావరణం నెలకొంది.

### రాహుల్‌కు నాన్‌బెయిల్‌బుల్

ఇదిలా ఉంటే శనివారం రాహుల్‌గాంధీకి భారీ షాక్ తగిలింది. పరువు నష్టం కేసులో ఆయన చిక్కుల్లో పడ్డారు. జార?ండ్‌లోని చైబాసాలోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు రాహుల్‌గాంధీకి నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది. జూన్ 26న కోర్టు ముందు స్వయంగా హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. పదే పదే విచారణకు హాజరుకాకపోవడంతో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రాహుల్ గాంధీ న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది.

## కేరళను తాకిన రుతుపవనాలు...



తిరువనంతపురం,మే24 నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయి. దాదాపు ఎనిమిది రోజులు ముందుగానే కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి. చివరిసారిగా 2009, 2001 సంవత్సరాల్లో ఇంత త్వరగా రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. అప్పుడు మే 23న రాష్ట్రాన్ని రుతుపవనాలు తాకాయి. ఇప్పుడు 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఇంత తొందరగా రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు వస్తాయి ఐఎండి ఇప్పటికే తెలిపింది. ఈ క్రమంలో శనివరాం ఉదయం నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని కేంద్ర వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో కేరళలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో రెండు రోజుల్లో రుతుపవనాలు విస్తరిస్తాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించనున్నాయి. 2009లో మే 23న రుతుపవనాలు ప్రవేశించాయి. మళ్లీ ఇన్నాళ్లకు త్వరగా రుతుపవనాలు వచ్చాయి. సాధారణ తేదీ కంటే 8 రోజులు ముందే రుతుపవనాలు వచ్చినట్లు- ఐఎండీ పేర్కొంది. వాస్తవంగా రోహిణి కార్తె సమయంలో ఎండలు మండిపోతుంటాయి. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తలేదు. ఇక రోహిణి కార్తె మే 25 ఆదివారం రానుంది. ఇది జూన్ 8 వరకు ఉంటుంది. రాహిణి కార్తె సమయంలో ఎండలు భగభగ మండిపోతాయి. తీవ్ర ఉష్ణోగ్రతతో బండరాళ్లు కూడా పగిలిపోతాయంటారు. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు కనిపించకపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలిసారిగా 1918 మే 11న రుతుపవనాలు ప్రవేశించిన రికార్డ్ ఉంది. అలాగే రుతుపవనాలు ఆలస్యంగా వచ్చిన రికార్డు ఉంది. 1972లో జూన్ 18న రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. గత 25 సంవత్సరాల్లో అత్యంత ఆలస్యంగా రుతుపవనాలు 2016లో వచ్చాయి. జూన్ 9న రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. ఇదిలా ఉంటే రుతుపవనాల రాకతో మే 29 వరకు కేరళ, తీరప్రాంత కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. తమిళనాడు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లలో కూడా రాబోయే ఐదు రోజుల్లో అక్కడక్కడ వర్షాలు మరియు ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

### విద్యుత్ షాక్‌తో ముగ్గురు దుర్మరణం

విజయవాడ,విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో శనివారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. చంద్రబాబు కాలనీలోని ఓ భవనంలో కరెంట్ షాక్ తగిలి ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో దంపతులతోపాటు- ఇంటికొచ్చిన బంధువు కూడా ఉన్నారు. స్థానిక వివరాల మేరకు ... నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ లో దంపతులు నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం 8 గంటల 20 నిముషాలకు భార్య ముత్యాలమ్మకు కరెంటు షాక్ తగిలి కుప్పకూలిపోయింది.

## భారత్‌ను బెంబేలెత్తిస్తున్న కరోనా.. కేరళ, ముంబై, ఢిల్లీలో పెరిగిన కేసులు

న్యూఢిల్లీ,భారత్‌లో మరోసారి కరోనా విజృంభిస్తోంది. గత కొద్ది రోజులుగా కేసులు అమాంతంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కేరళ, ముంబై, ఢిల్లీలో కోవిడ్ కేసులు భయాందోళన కలిగిస్తున్నాయి.దీంతో ఆస్పత్రుల్లో పడకలు సిద్ధం చేయాలని.. అలాగే ఆక్సిజన్ సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు వెళ్లాయి. ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటకలో ఈనెలలోనే కేసులు పెరిగాయి. చిన్నపాటి కేసులే అయినా అప్రమత్తంగా ఉండాలంటూ ఆదేశాలు వెళ్లాయి. ఇప్పటి వరకు ఎలాంటి మరణాలు సంభవించలేదు.జేఎన్ 1 వేరియంట్ కారణంగానే దక్షిణాసియాలో కోవిడ్ కేసుల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. ఢిల్లీలో ప్రస్తుతం 23 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దేశంలో అత్యధికంగా కేరళలో 273 కేసులు నమోదైనట్లు నివేదికలు అందుతున్నాయి. దాదాపు చాలా రోజుల నుంచి కోవిడ్ కేసులు లేవు. అలాంటిది అకస్మాత్తుగా ఉన్నట్టుండి కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణాల్లో నెమ్మది నెమ్మదిగా వైరస్ విజృంభిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ఆస్పత్రులను అప్రమత్తం చేశారు.ఇదిలా ఉంటే ఇప్పటి వరకు ఎక్కడా కూడా మరణాలు సంభవించలేదు. తేలికపాటి




వైరస్ కారణంగానే మరణాలు లేవని వైద్య బృందం అభిప్రాయపడుతోంది. ఇదిలా ఉంటే ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా దీన్ని ఆందోళన కలిగించే వేరియంట్‌గా పేర్కొనలేదు. వైరస్ సోకిన వారు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారు. కొన్ని సాధారణ లక్షణాలు జ్వరం, ముక్కు కారటం, గొంతు నొప్పి, తలనొప్పి, అలసట సంభవిస్తున్నాయి. ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని ఢిల్లీ ఆరోగ్య మంత్రి పంకజ్ సింగ్ అన్నారు.

## జంతువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు



హైదరాబాద్ : జంతువులను అక్రమంగా రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. ఎవరైనా జంతువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే కంట్రోల్ రూమ్ నంబర్ 8712661 155కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. బక్రీద్ పండగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు బషీర్‌బాగ్ కార్యాలయంలో గురువారం పలు గోసేవా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జంతువులను చంపుతున్న వీడియోలను సోషల్ మీడియాలో పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోరక్షకులు చట్టానికి లోబడి ఉండాలన్నారు. ఆవులను, ఇతర జంతువులను రక్షించడానికి పనిచేస్తున్నామని గోసేవా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కొందరి మనోభావాలు దెబ్బతినే విధంగా పశువులను చంపుతున్న వీడియోలను తీసి రీల్స్‌గా పెడుతున్నారని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## సంపాదకీయం

ఆదివారం 25-05-2025

### చిన్న గల్లీలు...పెద్ద ప్రమాదాలు !

వేసవి అనగానే ఎక్కడో ఒకచోట పెద్ద అగ్నిప్రమాదం అన్నది చూస్తూనే ఉన్నాం. గత నాలుగైదేళ్ల అనుభవాలు చూస్తే, అగ్నిప్రమాదాలు జరగడం సర్వసాధారణంగా మారింది. అప్పటికప్పుడు సహాయక చర్యలు తీసుకోవడం మినహా పెద్దగా ముందస్తు చర్యలు శూన్యం. ఇదంతా ప్రమాదాలు మానవ తప్పిదాలే అన్నది తెలుసుకోవాలి. ఇందులో ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టలేం. కాకపోతే ప్రమాదాలకు కారణాలను వెతికి నివారణ చర్యలు సూచించాల్సింది ప్రభుత్వమే. నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల పర్యవసానమే ప్రమాదాలకు కారణమని గుర్తించాలి. ఈ విపత్తుల విషవలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలి. అయితే ఎక్కువ ప్రమాదాలు చెత్త చెదారం, పాతభవనాలు, గ్యాస్ పేలుళ్లు, ప్లాస్టిక్ సామాన్య గోడౌన్లలోనే జరుగుతున్నాయి. దీనికి కేవలం ప్రజల నిర్లక్ష్యంగానే చూడాలి. హైదరాబాద్ గుల్జార్ హౌజ్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహా పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది.ఇది కేవలం వారి తప్పిదమే కారణమని తెలుసుకోవాలి. ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది వెళ్లడానికి కూడా వీలులేని ఇరుకు మెట్లను చూడవచ్చు. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు కేంద్రాలుగా ఎలా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరోసారి స్పష్టం చేసింది. వ్యవస్థీకృత లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతల వైఫల్యాలు కారణంగా పదే పదే ప్రమాదాలు సంభవిస్తున్నాయనడానికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరిగినా, ఇందులో పొరపాట్లు కూడా ఇమిడి ఉన్నాయి. ప్రమాదం జరిగినప్పుడు వెళ్లడానికి వీలు లేనంత ఇరుకుగా మెట్ల మార్గాలు ఉంటున్నాయి. వీటిపై మళ్లీ పై అంతస్తులు అనధికారికంగా నిర్మిస్తున్నారు. ఇలాంటివి నిరోధించే వీలుంది. ఇలాంటి భవనాలను గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవచ్చు. నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే నివసిస్తున్న వారి నిర్లక్ష్యం కనిపిస్తుంది. భవనాల్లో ఎప్పుడో వేసిన విద్యుత్ తీగలు వేలాడుతుంటాయి. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, వాటిపై అధిక లోడు పడేలా ఏసిలు, ఫ్రిజ్‌లు, ఇతర గృహోపకరణాలు ఉపయోగించడం చూడవచ్చు. తాత్కాలిక మరమ్మతులతో షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది.ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైపులైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే పెయింట్లు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వాటిని అజాగ్రత్తగా నిల్వ చేయడంతో పాటు మనుషుల నిర్లక్ష్యం కూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి. ప్రధానంగా లోడును పట్టించుకోకుండా ఉపయోగించే విద్యుత్ కారణంగా వైర్లు తగలబడి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. పాతబస్తీ లాంటి చోట వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనాన్ని వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాలకు కారణంగా చూడాలి. హైదరాబాద్ పాతబస్తీ తిరిగి చూస్తే...ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో అస్తవ్యస్తంగా ఉంటాయి. ఇక్కడ గల్లీలు కూడా ఇరుకుగా ఉండి రాకపోకలకు ప్రతిబంధకంగా ఉన్నాయి. దీనికితోడు దొంగకరెంట్ వాడకం కూడా ఎక్కువే. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది.ఇవన్నీ సవరించాల్సి ఉంది. ఇలాంటి వీధుల్లో ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి అనువుగా ఉండడం లేదు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సకాలంలో వాహనాలు చేరుకున్నా..గల్లీల్లో వెళ్లలేక పోవడంతో అవి పెద్ద ప్రమాదాలుగా మారుతున్నాయి. మంటలను నియంత్రించలేక పోతున్నారు. అక్రమ నిర్మాణాలతో పాటు ఆక్రమణలు కూడా పాతబస్తీలో ఎక్కువే. ప్రమాదాలు జరిగితే ప్రాణాలను కాపాడే అవకాశాలను తక్కువేనని గుల్జార్ హౌజ్ ప్రమాదం గుర్తు చేసింది. ఎందుకంటే అక్కడ ఇరుకైన భవనంలో ఈ ప్రమాదం జరిగింది. కేవలం పొగతో ఊపిరాడక సగం జనం చచ్చారు. ప్రజలు తమకున్న చిన్న ఇంటిపై మరో అంతస్తు నిర్మించుకుంటున్నారు. మనిషి దూరేంత సందులో కొట్లు కడుతున్నారు. ఇలా చేయడం వల్ల ప్రమాదాలను నిరోధించలేకపోతున్నారు. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్నిప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం కూడా ప్రమాదాల తీవ్రతను పెంచుతున్నాయి. వాణిజ్య, నివాస, పారిశ్రామిక, ప్రభుత్వ భవనాలకు తప్పనిసరిగా నిర్దిష్ట కాల వ్యవధిలో అగ్నిప్రమాదాలకు సంబంధించి ఆడిట్‌లు నిర్వహించాలి. భవనాల యజమానులు, ఆపరేటర్లు, నిర్వాహకులు తమ ప్రాంగణాలలో అగ్ని ప్రమాదాలపట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రమాణాలను పాటించే బాధ్యతను చట్టపరంగా చేయగలగాలి.విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను క్రమం తప్పకుండా తనిఖీ నిర్వహణ చేయడం విధిగా మారాలి. ప్రమాదం జరిగినప్పుడు సురక్షితంగా ఎలా బయటపడాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా పాతబస్తీలో జరిగిన ఈ ఘటనతో నగరంలో అనేక చోట్ల ఇలాంటి ఇరుకైన భవనాల కోసం అవసరమైతే డెమో నిర్వహించాలి. నిరంతరాయంగా ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులు తనిఖీలు నిర్వహించడం కూడా అవసరమే. ఇది ఒక్క పాతబస్తీకే పరిమితం కాదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అగ్నిప్రమాదాలపై ప్రజల్లో అవగాహనను పెంచాలి.

# విపక్షరాష్ట్రాల్లో ఇడి దూకుడు



న్యూఢిల్లీ,సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై మరోసారి సుప్రీం కోర్టు ఆగ్రహించడం తాజాగా చర్చనీయాంశమైంది. గత ఏడాది మే నెలలో ఇడి దర్యాప్తు తీరుపై ఎన్నో ఫిర్యాదులు రావడంతో సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించింది. దర్యాప్తుల సమయంలో భయోత్పాత వాతావరణం సృష్టించవద్దని హెచ్చరించింది. అయినాసరే ఇడి వ్యవహారంలో మార్పు రాలేదన్న విమర్శలు వస్తున్నాయి. చాలా కేసుల దర్యాప్తులో ఇడి తనకున్న అసాధారణ అధికారాలతో దూకుడుగా వ్యవహరిస్తోందని గత కొన్ని సంఘటనల బట్టి తెలుస్తోంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వం నిర్వహించే మద్యం రిటైలర్ టాస్మాక్‌లో రూ. 1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈ ఏడాది మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఇడి సోదాలు జరిపింది. ఇటీవల మళ్లీ మేనెల ఆరంభంలో టాస్మాక్ అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. ఈ అవకతవకలపై రాష్ట్రపోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇడి సోదాలు చేస్తోందని, టాస్మాక్ అధికారులను హింసిస్తోందని తమిళనాడు ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో తాజాగా సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఇడి తీరును తప్పుపట్టింది. సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఆగ్రహించింది. కర్ణాటక హెూం మంత్రి జి. పరమేశ్వరకు చెందిన విద్యాసంస్థల్లో కూడా బుధవారం (మే 21) ఇడి సోదాలు చేపట్టడం కలకలం రేపుతోంది. ఈ విద్యాసంస్థలు గత కొన్నేళ్లుగా పేరుపొందినవే. కర్ణాటక ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతుండడంతో బిజెపి కన్నెర్రనౌతోందని అందుకే దర్యాప్తు సంస్థలతో భయపెడుతోందని, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తోందని కర్ణాటక కాంగ్రెస్ తీవ్రంగా విమర్శిస్తోంది.కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసులో కర్ణాటక హెూం మంత్రి విద్యాసంస్థలకు, రన్యారావుకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఇడి అనుమానిస్తోంది. ఈ దాడులు వెనుక కేంద్రంలోని అధికార బిజెపి ప్రేరణ ఉందని కర్ణాటక కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది రూ. 2000 కోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులో అప్పటి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్‌ను ఇరికించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రయత్నిస్తోందని, దీనికోసం తమ రాష్ట్రంలో భయానక పరిస్థితి కల్పిస్తోందంటూ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విధి నిర్వహణలో భాగంగా అవతలివారిని బెదిరించి భయపెట్టడం మంచిది కాదని సుప్రీం కోర్టు ఇడిని మందలించింది. మనీలాండరింగ్ చట్టం లోని కొన్ని నిబంధన లను కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం చేసి భయపెట్టడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందని కూడా చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చింది.ఆనాడు చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం సాగడం రాజకీయంగా అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడా నికే అన్న అపవాదు కూడా వచ్చింది. కర్ణాటకలో వాల్మీకి ఎస్‌టి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుక్కునేలా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేరును తెరపైకి తీసుకురాడానికి కూడా ఇడి పావులు కదిపినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు ఇడి అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని కర్ణాటక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ కల్లేష్ బి ఫిర్యాదు చేయడంతో ఇడి అధికారులు ఇద్దరిపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే కర్ణాటక హైకోర్టు దీనిపై స్టే విధించడంతో ఈ వ్యవహారానికి బ్రేకు పడింది. నగదు అక్రమ చలామణీ జరిగిందని ఇడి పెడుతున్న కేసుల్లో చాలావరకు శిక్షలు పడడం తక్కువే అని సుప్రీం కోర్టు కూడా గతంలో వ్యాఖ్యానించిం ది.పక్కాగా సాక్షాధారాలు సేకరించడంలో ఇడి వైఫల్యాన్ని సుప్రీం ఎత్తి చూపింది. 2014 2024 మధ్య కాలంలో నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద 5297 కేసులు పెట్టగా, వాటిలో 40 కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయని కేంద్ర హెూంశాఖ గత ఏడాది వెల్లడించిన సంగతి ఈ సందర్భంగా ప్రస్తావించ వలసి ఉంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్‌పై సోదాలు కూడా దూకుడుగా హద్దులు దాటుతుండడమే అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడం ఇడి విశ్వసనీయతకు తీరని కళంకం. టాస్మాక్‌పై జరుగుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తుపై సుప్రీం స్టే విధించడం ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అంశం. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బిజెపి కుట్రల్లో ఇదో భాగంగా తమిళనాడు ప్రభుత్వం విమర్శిస్తోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ వంటి దర్యాప్తు సంస్థల దాడులు విచక్షణా రహితంగా సాగుతున్నాయన్న అపవాదు చాలా కాలంగా వినిపిస్తోంది.కేంద్రం కనుసన్నల్లోనే ఇవి పనిచేస్తున్నా యన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న విపక్ష పాలిత రాష్ట్రాల పైనే ఈ దాడులు టార్గెట్ చేసుకుంటున్నాయి. ఆయా వర్గాల ఆస్తులు జప్తు అవుతన్నాయి. ఇడి జప్తు చేసిన ఆస్తుల పరిస్థితి పరిశీలిస్తే యుపిఎ ప్రభుత్వ హయాంలో 200405 నుంచి 201314 వరకు కేవలం రూ. 5346 కోట్ల ఆస్తులే జప్తు కాగా, మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2014 నుంచి 2022 వరకు రూ. 99,356 కోట్ల విలువైన ఆస్తులు జప్తు అయ్యాయి. అలాగే ఇడి కేసుల్లో 95% ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో నమోదైనవే.

# మళ్లీ విఫలమైన యూరప్

యూరప్,మన విక్రమార్కుని బేతాళ కథలు ఇంగ్లీషు, తదితర విదేశీ భాషలలోకి అనువాదమయాయో లేదో తెలియదు. ఒకవేళ అయిఉంటే ప్రస్తుత ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాను ఏదో విధంగా లొంగదీయాలనే యూరోపియన్ దేశాల విశ్వప్రయత్నాలను, ఆ ప్రయత్నాలు ప్రతిసారి విఫలం కావటాన్ని ప్రపంచ జర్నలిస్టులు, నిపుణుల ఆ కథలతో పోల్చి ఉండేవారు. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత యూరోపియన్ నాయకులకు కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. అవి, ఆయనను ఎట్లాగయినా సరే సైనికంగా తమతోపాటు ఉక్రెయిన్ పక్షాన నిలపాలనే యుక్తులు. కాని అవి కూడా ఫలించడం లేదు. అనగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి, యూరప్‌కు విక్రమార్కుడి బేతాళ శవం విషయమై డబుల్ వైఫల్యాలన్నమాట.అటువంటిదే ఈ నెల 1920 తేదీలలో మరొకసారి జరిగింది. అట్లా జరగటం ఇది ఎన్నవసారంటే ఎవరైనా లెక్కిస్తున్నారో లేదో తెలియదు గాని, ఆ లెక్క మన వద్ద మాత్రం లేదు. ఇంతకూ ఈసారి జరిగిందేమిటో చెప్పుకుందాము. ఉక్రెయిన్ యుద్ధాన్ని తాను పదవిని స్వీకరించిన 24 గంటలలో ముగిసేట్లు చేయగలనని ట్రంప్ తన ప్రచార సమయంలో ప్రకటించటం తెలిసిందే. ఆ మాటను మరీ అక్షరాల కాకున్నా త్వరగా ముగింపజేయటం అనే అర్థంలో తీసుకోవాలి. ఆ గడువులోగా తను ఆ పని చేయలేకపోయినా అందుకోసం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నమాట నిజం. ఆయన విధానాలను ఇతరత్రా తీవ్రంగా విమర్శిస్తున్నవారు కూడా తను యుద్ధ పిపాసి కాదని, ఉక్రెయిన యుద్ధం ముగియాలన్నది తన కోరిక అని, అందుకు ప్రశంసించాలనే అంటున్నారు.ఆ మేరకు గత రెండు వారాలలో జరిగిందేమిటన్నది చూస్తే, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీలను ట్రంప్ చర్చలకు ఒప్పించారు. రాజీలో ఉక్రెయిన్ వైపు నుంచి కొన్ని జరగాలని ట్రంప్ మొదటి నుంచి సూచిస్తున్న వాటిని ఈసారి కూడా ప్రకటించారు. అవి, రష్యా ఆక్రమణలోగల క్రిమియాను, దోన్‌బాస్‌లోని ప్రాంతాలను వారి కి వదలివేయటం, ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇవ్వకపోవటం. ట్రంప్ ప్రయత్నాల ఫలితంగా గత మూడేళ్ల యుద్ధంలో మొదటిసారిగా రెండు దేశాల ప్రతినిధుల మధ్య ముఖాముఖి చర్చలు ఈనెల 9న టర్కీ నగరం ఇస్తాంబుల్‌లో జరిగాయి. వాస్తవానికి యుద్ధం ఆరంభమైన తొలి రోజులలోనే కొన్ని చర్చలు జరిగి నా అపుడు కుదిరిన రాజీనుంచి ఉక్రెయిన్ ఉపసంహరించుకున్నందున వాటికి విలువ లేకుండా పోయింది. ఇస్తాంబుల్ చర్చల విషయానికి వస్తే, ఒక్క సమావేశంలోనే తుది పరిష్కారం రాగలదని ఎవరూ ఆశించలేరు. కాని, ఒక ఆరంభమంటూ జరిగితే క్రమంగా ముందుకుపోవచ్చు. ఆ విధంగా ఇస్తాంబుల్‌లో ఇరువురూ వెయ్యేసి మంది యుద్ధ ఖైదీలను మార్చుకునేందుకు అంగీకరించారు. చర్చలు ముందుకు సాగేందుకు రష్యా తన ప్రతిపాదనలు ముందుపెట్టింది.సమస్య అక్కడ మొదలైంది. ఉక్రెయిన్ కూడా తన ప్రతిపాదనలు చేసి తర్వాత మళ్లీ కూర్చోవచ్చు. చర్చలు ఎపుడైనా అట్లాగే సాగుతుంటాయి. కాని ఉక్రెయిన్ ఆ పని చేయక, వెంటనే 30 రోజుల పాటు బేషరతుగా యుద్ధ విరమణ జరిగితేనే తాము ముందుకు పోగలమన్నది. ఈ మాట గత నెల రోజులుగా అంటున్నా రష్యా అంగీకరించ లేదు. ఆ 30 రోజులను ఉపయోగించుకుని సైన్యాలను, ఆయుధాలను మరింతగా నియోగించటం ఉక్రెయిన్ ఎత్తుగడ అని, అటువంటిది చేయబోమన్న హామీ లభించి, ఆ విషయమై తటస్థుల పర్యవేక్షణ ఉంటే మాత్రమే అంగీకరించగలమని రష్యా స్పష్టం చేసింది. ఇక్కడ గుర్తించవలసింది ఒకటున్నది. ఒకవేళ ఇందులో ఉక్రెయిన్ ప్రమేయం మాత్రమే ఉంటే ఒక విధంగా ఉండేది. కాని ఈ వ్యవహారం పొడవునా జెలెన్‌స్కీని వెనుక ఉండి నడుపుతున్న యూరోపియన్ యూనియన్ నాయకులు అందుకు సరిపడనివ్వలేదు. దానితో ఇస్తాంబుల్ చర్చలు అంతటితో నిలిచి పోయాయి.ఆ వెంటనే యూరోపియన్



నాయకులు తమ అజెండాను ముందుకు తెచ్చారు. అది, రష్యా కాల్పుల విరమణకు అంగీకరించటం లేదనే వాదన చేస్తూ ట్రంప్‌ను తమవైపు తిప్పుకోవ టం. ఆయన గతంలోనే సమస్యకు రాజీ జరగాలంటూ ఉక్రెయిన్‌కు సహాయం ఆపివేయటం, రష్యా వాదనలు సమంజసమైనవని అభిప్రాయపడటం జరిగినప్పటి నుంచీ యూరప్, జెలెన్‌స్కీలు వ్యూహం సరిగా ఇదే. ట్రంప్‌ను ముగ్గులోకి లాగటం. వారికి శాంతియుతమైన పరిష్కారం ఎప్పుడూ ఇష్టం లేదు. ట్రంప్ రాకకు ముందు కూడా. ఇపుడాయన రాజీ ధోరణి చూపుతుండగా అటువంటిది జరగరాదని, తనన్ను మాజీ అధ్యక్షుడు బైడెన్ కాలంలోవలే ఉక్రెయిన్‌కు అనుకూలం గా రంగంలోకి తీసుకు రావాలని, రష్యాను ఓడించి తీరాలన్నది వారి పట్టుదల. ట్రంప్ కన్న ముందు బైడెన్ ఆ విధంగానే చేసినా రష్యాను ఓడించలేకపోయామని, ఉక్రెయిన్ భూభాగాలను రష్యా 20 శాతం వరకు ఆక్రమించుకున్నదని, యుద్ధం వల్ల ఉక్రెయిన్‌కు తీవ్రనష్టాలు జరుగుతున్నాయని, రష్యాపై అందరూ కలిసి దాదాపు 22,000 ఆంక్షలను విధించినా ప్రయోజనం లేకపోయిందని తెలిసి కూడా తమ ప్రయత్నాలు మానటంలేదు.మరొక వైపు స్వయంగా తమ ఆర్థిక, సైనిక శక్తులు బలహీనపడుతూ ప్రజాభిప్రాయం క్రమంగా వ్యతిరేకమవుతున్నా తమ ధోరణి మారటం లేదు.ఈ స్థితిలో అమెరికా కొత్త అధ్యక్షుని వైఖరి యూరోపియన్ నాయకులకు, వారికి బందీ అయిపోయిన జెలెన్‌స్కీకి పెద్ద సంకటంగా మారింది. అమెరికా తమ వెంట ఉన్నపుడే ఏమీ చేయలేనివారు తన అండలేనట్లయితే? అందువల్లనే ట్రంప్ గెలిచే సూచనలు ప్రచార సమయంలో కనిపించినప్పటి నుండి మొదలు కొని ఈ రోజు వరకు కూడా రక రకాలు ఉపాయాలతో ఆయన మనసు మార్చేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. జెలెన్‌స్కీని రెచ్చగొట్టటం, ట్రంప్ వద్ద పుతిన్ వ్యతిరేక ప్రచారాలు, అమెరికా తోడ్పాటు లేకున్నా తాము ఎంతకాలమైనా సరే ఉక్రెయిన్‌కు మద్దతునివ్వగలమనటం, తమ రక్షణ బడ్జెట్లు పెంచటం వంటివన్నీ అందులో భాగమే. ఇస్తాంబుల్ చర్చలు ప్రతిష్ఠంభనకు గురయ్యాయి గాని, వాస్తవానికి యూరోపియన్ నాయకులు అందుకు సన్నాహాలు అంతకు ముందు రోజులలోనే ఆరంభించారు. నెల రోజులపాటు బేషరతు సంపూర్ణ కాల్పుల విరమణ అనే మాట అందులో భాగమే.వారు చెప్పే దాని ప్రకారం తమ ప్రతిపాదనను రష్యా ప్రతి విషయంలో యథాతథంగా అంగీకరిస్తేనే శాంతికి సిద్ధపడినట్లు లెక్క. రష్యా తన పరిస్థితుల ప్రకారం ఎటువంటి షరతులు విధించరాదు. ఉక్రెయిన్ మాత్రం ఏ షరతులకూ ఒప్పుకోదు. వారు ఒప్పుకోనివ్వరు. చివరకు 30 రోజుల విరమణ మాట ట్రంప్‌తో కూడా అనిపించారు. ఆ వెనుక ఆయన ఇద్దరు అధ్యక్షులతో సుదీర్ఘంగా ఫోన్‌లో మాట్లాడి, ఇక చర్చలు మొదలవుతాయన్నారు. తీరా ఇస్తాంబుల్‌లో కూర్చునే సరికి యూరోపియన్ల వ్యూహం ముందుకు వచ్చింది. ఇందులోని ఉపాయం ఏమంటే, 30 రోజుల బేషరతుకు పుతిన్ కాదన్నట్లయితే, దానిని ఒక కారణంగా చూపుతూ, ఇక ట్రంప్‌ను తమ వైపు తిప్పుకోవటం.

# ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

ఒంగోలు,ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొమరోలు మండలం తాటిచెర్లమోటు- వద్ద శుక్రవారం మధ్యాహ్నం కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. క్షతగాత్రులను గిద్దలూరు ప్రభుతాసుపత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మరోవైపు మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులంతా స్టువర్ట్‌పురం వాసులను పోలీసులు తెలిపారు. కారులోని వారంతా మహానంది వద్దనున్న మహాబలిపురం వెళ్లి.. బాపట్ల తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు- చేసుకుందని వెల్లడించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు- పోలీసులు వివరించారు. ప్రమాద సమయానికి ముందు కారు, లారీలు రెండు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయని.. అందుకే ప్రమాద తీవ్రత బాగా పెరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారంతా మరణించారని చెప్పారు. కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పథకాలకు చేయూతనివ్వండి

హైదరాబాద్,రాజీవ్ యువ వికాసం పథకం కింద జూన్ 2వ తేదీన ఐదు లక్షల మంది యువతకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్న లక్ష్యాన్ని సమయానికి సాధించేందుకు బ్యాంకర్ల సహకారం అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవడం ముఖ్యమని అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఐదు లక్షల యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.6,250 కోట్లు సబ్సిడీతో ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. యువతను ఉత్పత్తి రంగంలోకి తీసుకువచ్చి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తోడ్పడేలా పథకం రూపొందించామని తెలిపారు.రాజీవ్ యువ వికాసం పథకం సజావుగా అమలవడానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారి నియమించి సమన్వయం చేయాలని, పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రత్యేకంగా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకాలు అందిస్తోందని, ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి రూ.21 వేల కోట్లను బ్యాంకుల్లో జమ చేసి రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నట్టు తెలిపారు. అలాగే రైతు బీమా ప్రీమియం డబ్బులు ప్రభుత్వం కట్టుతుందని తెలిపారు. అదివి బిడ్డల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఇన్‌దిరా సౌర గిరి జల వికాస పథకం రూపకల్పన చేసి, రూ.12,600 కోట్లు ఖర్చు పెట్టి ఆరు లక్షల 70 వేల ఎకరాలలో సౌర విద్యుత్తును సాగులో ఉపయోగించాలని ప్రణాళిక చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్షల కోట్లు వడ్డీ రహిత రుణాలుగా ఇస్తూ మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు చేస్తున్నామని, పరిశ్రమల కోసం ట్రైనింగ్ అందిస్తున్నామని తెలిపారు. మూసీ నదిని పునర్జీవం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య పారిశ్రామిక అభివృద్ధి కోసం వివిధ క్లస్టర్ల ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు.

# ధాన్యం రైతుల దైన్యం..

హైదరాబాద్,జిల్లాల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకువచ్చి రోజులు, వారాల తరబడిగా పడిగాపులుగాస్తున్నా హమాలీలు లేక తూకం వేయడం లేదు. కొన్నిచోట్ల తూకం వేసినా లారీలు రాక వడ్లు రైస్ మిల్లులకు తరలించలేకపోతున్నారు. ఉత్తర తెలంగాణలోని ఆదాలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లతో పాటు మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ తరుణంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయి. పలుచోట్ల రోడ్లమీద ఆరబోసిన వడ్లు వరదకు కొట్టుకుపోయి రైతులకు నష్టం వాటిల్లుతోంది. యాసంగిలో రైతుల నుంచి మొత్తం ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు పీఏసీఎస్, ఐకేపీ, మార్కెటింగ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలోకొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.కాగా అనేక చోట్ల ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోంది. వరిసాగు చేసిన రైతులందరూ హార్వెస్టర్లతో పంట కోసి వడ్లను కేంద్రాల వద్దకు తీసుకువస్తున్నారు. కానీ హమాలీల కొరత వల్ల వడ్లు తూకం వేయలేక పోతున్నారు. స్థానిక కూలీలు ముందుకు రాకపోతుండగా బీహార్ కూలీలు వస్తేగాని వడ్లు కాంటా పెట్టలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు సరిపడినన్ని లారీలు రాకపోవడంతో కాంటా పెట్టిన వడ్ల సంచులను రైస్ మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో తరచు వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు కేంద్రాలు జలమయమవుతున్నాయి. వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. కాంటాపెట్టి బస్తాల్లో నింపి రైస్? మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు నానిపోతున్నాయి. కొన్నిచోట్ల మూడు, నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వడ్లు ఎండక మొలకలు వచ్చాయి. బుధవారం కురిసిన వర్షానికి పలు ప్రాంతఆల్లో రోడ్లమీద ఆరబోసిన వడ్లు వరదలో కొట్టుకుపోయాయి. ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. కేంద్రాల నిర్వాహకు లు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాలకు వడ్లు తీసుకువచ్చి చాలా రోజులవుతున్నా కాంటా పెట్టడం లేదని, అకాల వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అకాల వర్షం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతన్నను అతలాకుతలం చేసింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం దంచికొట్టింది. ఫలితంగా ధాన్యం కొనుగోలు సెంటర్ల వద్ద ఆరబెట్టిన, బస్తాల్లో నింపిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు కుంటాల, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తడిసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు బేల, జైనథ్, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. బేల మండల కేంద్రంలోని మార్కెట్? యార్డులో ఉన్న జొన్నలు తడిసిపోయాయి. దండేపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత భారీ వర్షం కురిసింది. దీంతో కళ్లాల్లో ఉన్న వరి కుప్పల్లోకి నీరు చేరింది.

# కవిత లేఖ ఓటిటి ఫ్యామిలీ డ్రామా

హైదరాబాద్, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లేఖపై ఇప్పటికే రేవంత్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు స్పందించారు. తాజాగా కవిత లేఖపై బీజేపీ సైతం స్పందించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన ట్విట్టర్ వేదికగా శుక్రవారం స్పందించారు. కాంగ్రెస్ వదిలిన బాణం అనే శీర్షికతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. డాడీకి రాసిన లేఖ ఒక ఓటీటీ- ఫ్యామిలీ డ్రామాగా మారవచ్చునని ఆయన వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. తెలంగాణను విఫలం చేశాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వారంత కలిసి బీజేపీని నిందిస్తున్నారని చెప్పారు. కుటుంబ పాలనను తమ పార్టీ నిత్యం వ్యతిరేకిస్తునే ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అది గాంధీ ఫ్యామిలీ అయినా.. కల్వకుంట్ల ఫ్యామిలీ అయినా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కుటుంబ పార్టీలు వారి వ్యక్తిగత సంక్షోభాలను ప్రజా భావోద్వేగంగా మార్చడానికి ప్రయత్నిస్తాయన్నారు. ఎవరైనా దోషి అయితే.. వారిని ఏదీ రక్షించ లేదన్నారు. కానీ ఈ అంశాన్ని తెలంగాణ చూస్తుందని.. ఆ క్రమంలో ఈ డ్రామాను తీవ్రంగా పరిగణించడం లేదని తెలిపారు.అయితే ప్రతీ సర్వేలో భారతీయ జనతా పార్టీ గ్రాఫ్ పెరుగుతుందన్నారు. శబ్దం లేకుండా, అధికారం లేకుండా, కేవలం ప్రజల నమ్మకంతోనే తమ పార్టీ ప్రజల్లో అంతర్లీన ప్రవాహంగా వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు నిజమైన మార్పుతోపాటు- అభివృద్ధిని సైతం కోరుకుంటున్నారని తెలిపారు. రాజకీయం.. కుటుంబ డ్రామా కాదన్నారు. ఆ మార్పు బీజేపీతోనే అవుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక కల్వకుంట్ల కవిత లేఖపై బీజేపీ ఎంపీ ఎం. రఘునందన్ రావు స్పందించారు. కవిత లేఖ రాజకీయ పంచాయితీనా? ఆస్తుల పంచాయితీనా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కవిత మరో షర్మిల కాబోతున్నట్లు- కనిపిస్తోందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి కవిత వెళ్లే అవకాశాలు కనపడుతున్నాయన్నారు. కవిత లేఖ డ్రామా వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు కనిపిస్తోందని చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో వారసత్వ చిచ్చు నిజమని తెలుస్తోందన్నారు. కవితను బయటకు పంపేందుకే కేటీఆర్, హరీశ్‌రావు ఒకటయ్యారని తెలిపారు. ఎవరు ఏం చేసినా తెలంగాణలో మాత్రం బీజేపీదే అధికారమని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# వందేళ్లయినా కెసిఆర్ ఫ్యామిలీ అంతా ఒక్కటే

హైదరాబాద్,ఆర్టిఫిషియల్ లేఖను కూడా ఎమ్మెల్సీ కవిత సరిగా రాయలేక పోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. లేఖకు, ఎమ్మెల్సీ కవితకు సంబంధమే లేదని కోమటిరెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారని అన్నారు. కోమటి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లెటర్ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని చెప్పారు. 20 లేదా 30 సీట్లలోనే బిఆర్ఎస్ పోటీ- చేస్తుందని, బిఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బిజెపితో కలుస్తుందని జోస్యం చెప్పారు. వందేళ్లయినా కెసిఆర్ కుటుంబం కలిసే ఉంటుందని, కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత గురించి ఆలోచించే సమయం తనకే లేదని, ఇక మా సిఎం రేవంత్ రెడ్డికి ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. వరంగల్ లో కెసిఆర్ పెట్టిన సభ తాను ఒక్కడినే పెట్టగలనని కోమటి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారాసకు భవిష్యత్తు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత రాసినట్లు- బయటకు వచ్చిన లేఖపై ఆయన స్పందించారు. ఆ లేఖ.. ఓ జోక్ అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ రాసే లేఖ ఓ పద్ధతిగా ఉందా? ఆ లేఖను సృష్టించాల్సిన అవసరం మాకేంటి? భారాసలో చీలిక ఏమీ లేదు.. ఇదంతా ఓ డ్రామా. దానిలో భాగమే ఈ లేఖ. తండ్రికి లేఖ రాయాల్సిన అవసరమేంటి? ఆమె నేరుగా చెప్పొచ్చు కదా! కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు వస్తాయంటే ఎవరైనా నమ్ముతారా? వారు గొడవపడరు.. ఒకవేళ అలా జరిగితే అది ఆస్తుల గురించే అవుతుందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

# అరెస్ట్ నువ్వా నేనా?

హైదరాబాద్, 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడింది. అప్పటి నుంచీ అటాకింగ్ పాలిటిక్సే చేశారు గులాబీ బాస్. ఉద్యమాలు, సమ్మెలు, మానవహారాలు, రాజీనామాలు, ఉప ఎన్నికలతో ధూంధాం చేశారు. ప్రత్యేక రాష్ట్రంతో పవర్‌లోకి వచ్చాక కూడా ప్రతిపక్షాలపై అదే దూకుడు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను లాగేసుకున్నారు. అక్రమ అరెస్టులతో అరాచకంగా పాలించారు. ధర్నా చౌక్ ఎత్తేశారు. ఉద్యమకారులను అణగదొక్కారు. పదేళ్లు బంగారు తెలంగాణ భ్రమ కల్పించారని అంటారు. కట్ చేస్తే

భయపడుతున్నారా?

ఫస్ట్ టైమ్ కేసీఆర్‌లో.. టన్నుల్లో భయం కనిపిస్తోందని అంటున్నారు. కాళేశ్వరం ఉచ్చు ఆయన మెడకు గట్టిగానే బిగుస్తోంది. తమ ముందు హాజరుకావాలంటూ కమిషన్ నోటీసులు ఇవ్వడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని తెలుస్తోంది. కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు సైతం హడలిపోతున్నారట. అందుకే, మామా అల్లుళ్లు వరుసబెట్టి మీటింగులు పెట్టుకుంటున్నారు. గంటల తరబడి వ్యూహాలు రచిస్తున్నారు. కాళేశ్వరం ఊబిలోంచి ఎలా బయటపడాలా అని మెదళ్లకు పదును పెడుతున్నారు. తెలంగాణ చాణక్యుడిగా పేరు గాంచిన కేసీఆర్‌లో ఇంతటి ఉలిక్కిపాటు ఇంతకు ముందెప్పుడూ చూడలేదని చెబుతున్నారు. ట్రబుల్ షూటర్‌గా ఇమేజ్ ఉన్న హరీశ్‌రావు గతంలో ఎప్పుడూ ఇంతగా హైరానా పడలేదని అంటున్నారు. ఆ ఇద్దరు మేధావులు.. కాళేశ్వరం కమిషన్ ముందు ఏం చెప్పాలి? ఎలా గండం నుంచి గట్టెక్కాలి? అంటూ తెగ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

ఈటల ఇరికిస్తారా?

మరోసారి ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో హరీశ్‌రావు ప్రత్యక్షమయ్యారు. మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. మే 20న ఇలానే ఫాంహౌజ్‌కు వెళ్లి కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అంటే, రెండు రోజుల గ్యాప్‌లో వాళ్లిద్దరూ అలా గంటల తరబడి చర్చలు జరిపారంటే.. ఎంతలా భయపడుతున్నారో తెలుస్తోందని అంటున్నారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులపైనే ఇద్దరు నేతలు చర్చిస్తున్నట్టు సమాచారం. కేటీఆర్ సైతం వారి చర్చల్లో పార్టిసిపేట్ చేశారు. ముగ్గురు కలిసి కాళేశ్వరం స్కాం నుంచి బయటపడే వ్యూహాలు రచిస్తున్నారని తెలుస్తోంది. మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు సైతం కమిషన్ నోటీసులు ఇవ్వడంతో.. ఆయనేమైనా మనల్ని ఇరికిస్తారా? అనే అనుమానమూ వారిలో వ్యక్తం అవుతోందని అంటున్నారు. కేసీఆర్, హరీశ్‌రావులపై ఈటలకు పాత పగలు చాలానే ఉన్నాయంటున్నారు. తనను పార్టీ నుంచి వెళ్లగొట్టిన గులాబీ బాస్‌పై రివేంజ్‌కు ఇదే కరెక్ట్ ఛాన్స్ అనుకుంటున్నారా? పదవుల కోసం మిత్రుడికి వెన్నుపోటు పొడిచిన హరీశ్‌రావుతో ఈటల ఆటాడుకుంటారా?

# ఐటీఐల పురోగతితో నైపుణ్యాభివృద్ధి



న్యూఢిల్లీ,ఇండియాలో వృత్తి విద్య అంటే తొలుత పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లే గుర్తొస్తాయి. కాలక్రమంలో అవి తమ ప్రభను కోల్పోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఐటీఐ విద్యకు కొత్త జవం అందించేందుకు రూ.60 వేల కోట్లతో కేంద్రం ఇటీవల కొత్త పథకం ప్రారంభించింది.ఇండియాలో వృత్తి విద్య అంటే తొలుత పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లే గుర్తొస్తాయి. కాలక్రమంలో అవి తమ ప్రభను కోల్పోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఐటీఐ విద్యకు కొత్త జవం అందించేందుకు రూ.60 వేల కోట్లతో కేంద్రం ఇటీవల కొత్త పథకం ప్రారంభించింది.వచ్చే నాలుగైదేళ్లలో ఉపాధి రంగ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వెయ్యి పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలను) సంస్కరించడానికి భారత ప్రభుత్వం సిద్ధమైంది. నైపుణ్య వృద్ధికి అయిదు ఉత్కృష్ట నైపుణ్య కేంద్రాలను స్థాపించాలని నిర్ణయించింది. అందుకోసం రూ.60వేల కోట్లు వెచ్చించనుంది. ఈ పెట్టుబడి మానవ వనరుల అభివృద్ధిలో గొప్ప సత్ఫలితాలు తెచ్చే అవకాశం ఉంది. కేంద్రం కొత్త పథకం ఐటీఐల ఆధునికీకరణకు తోడ్పడుతుంది. పాఠ్యాంశాలను, శిక్షణలో వాడే యంత్రాలను నవీకరించేందుకు అక్కరకొస్తుంది. పరిశ్రమలతో పొత్తును బలోపేతం చేస్తుంది. వృత్తి విద్యను పారిశ్రామిక అవసరాలతో అనుసంధానించడం ఇటు విద్యార్థులకు, అటు పారిశ్రామికవేత్తలకూ ఉపయుక్తమవుతుంది. భువనేశ్వర్, చెన్నై, హైదరాబాద్, కాన్పూర్, లూధియానాలలో అయిదు జాతీయ స్థాయి ఎక్సలెన్స్ కేంద్రాలు ఏర్పాటవుతాయి. అవి ఎలక్ట్రానిక్స్, హరిత ఇంధనం, ఆటోమోటివ్ తయారీ వంటి రంగాల్లో అధునాతన నైపుణ్యాలపై దృష్టి సారిస్తాయి. ఇవన్నీ భారతదేశ దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణమైన నిర్ణయాలే. ఈ పథకానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు సమకూరుస్తాయి. పరిశ్రమల నుంచీ సహకారం లభిస్తుంది. ముఖ్యంగా కేంద్రం వాటాలో సగం ఆసియా అభివృద్ధి బ్యాంకు, ప్రపంచ బ్యాంకుల నుంచి వస్తుంది. భారతదేశ నైపుణ్యాభివృద్ధి ప్రయత్నాల పట్ల ఆ సంస్థల విశ్వాసాన్ని ఇది తెలియజేస్తోంది.

శ్రామిక శక్తి సృష్టి

ఆర్థిక వ్యవస్థ గమనంలో ఒక కీలకమైన దశలో ఈ భారీ పెట్టుబడి వస్తోందని గుర్తించాలి. ఒకప్పుడు వేగవంతమైన ఆర్థిక పురోగమనానికి సాఫ్ట్‌వేర్, ఐటీ సేవల రంగం తప్ప వేరే మార్గమే లేదనే పరిస్థితి ఉండేది. ఇటీవలి కాలంలో ఆ రంగంలో కొంత అస్థిరత కనిపిస్తోంది. బడా టెక్ కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కొత్త నియామకాలు మందగించాయి. మరోవైపు ఏఐతో ఎన్నో ఉద్యోగాలు మాయమవుతాయనే భయం నానాటికి పెరుగుతోంది. టెక్ రంగంలో ఈ పరిణామాల నేపథ్యంలో వృత్తి శిక్షణ ఒక ముఖ్యమైన మార్గాంతరంగా ముందుకొస్తోంది. వెల్డింగ్, ప్రెసిషన్ మెషినరీ, ఎలక్ట్రిక్ వెహికల్ రిపేర్, సోలార్ ఇన్‌స్టలేషన్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి రంగాల్లో వృత్తి శిక్షణకు, నిపుణులకు భారీ గిరాకీ ఉంది. బలమైన వృత్తి శిక్షణ వ్యవస్థలు సమతుల ఆర్థిక వృద్ధికి ఎంతో కీలకమని చాలా కాలంగా జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాలు నిరూపిస్తున్నాయి. భారతదేశ విద్యారంగం చరిత్రాత్మకంగా పారిశ్రామిక ప్రపంచానికి అవసరమయ్యే నైపుణ్యాల కన్నా పట్టాలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. ఆ పట్టాలకు పరిశ్రమ అవసరాలకు మధ్య పొంతన లేక ఎంతోమంది ఉపాధి వేటలో వెనకబడుతున్నారు. కేంద్రం కొత్త పథకంతో ఐటీఐల దశ, దిశ మారే అవకాశం ఉంది. అయిదేళ్లలో 20 లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వడం, యాభై వేల మంది బోధకులను తయారు చేయడం కేంద్రం లక్ష్యాలు. అవి సాకారం అయితే, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా పోటీపడగల అధునాతన శ్రామిక శక్తిని సృష్టించడం సాధ్యమవుతుంది.

మేలిమి నిర్ణయం

భారత జనాభాలో సుమారు 50శాతం ముప్పై ఏళ్ల లోపువారే. అభివృద్ధి చెందిన దేశాలెన్నింటిలోనో ప్రస్తుతం కార్మికుల కొరత వేధిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆధునిక ప్రమాణాలకు తగ్గట్టుగా ఐటీఐలలో శిక్షణ పొందిన భారతీయ యువత, దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కీలక నైపుణ్య అవసరాలను తీర్చగలుగుతుంది. ఇది పూర్తిస్థాయిలో సాకారం కావాలంటే ప్రజల ఆలోచనా ధోరణిలోనూ మార్పు రావాలి. చాలా కాలంగా ఐటీఐ చదువుల పట్ల సమాజంలో ఒక చిన్నచూపు నెలకొంది. ఇది సరి కాదు. ఉద్యోగం ఇవ్వలేని ఇంజినీరింగ్ పట్టాకన్నా, గౌరవమైన ఉపాధిని అందించగల వృత్తివిద్య మేలన్న అవగాహన సంఘంలో బలపడాలి. ఐటీఐల కోసం అరవై వేల కోట్ల రూపాయల పెట్టుబడి అంటే, భారతదేశ అభివృద్ధి ప్రాధాన్యతల పరంగా గొప్ప నిర్ణయమే. విశ్వవిద్యాలయ పాఠ్యాంశాల కంటే పరిశ్రమలు వేగంగా పరిణామం చెందుతున్న నేటి ప్రపంచంలో, అధునాతన వృత్తివిద్య ప్రపంచ విపణికి కావాల్సిన కార్మికులను అందిస్తుంది. ఈ సాహసోపేతమైన అడుగు... నైపుణ్యాలకు పెద్దపీట వేస్తూ భారతదేశ అభివృద్ధికి బాటలు పరుస్తుంది.

# ఆర్థిక దిగ్బంధంలో రేవంత్ రెడ్డి సర్కార్




హైదరాబాద్,ఆదాయం లేక, కేంద్రం నుంచి గ్రాంట్స్ సరిగా రాక పోవడంతో ఆర్థిక దిగ్బంధంలో రేవంత్ సర్కారు ఉన్నట్లు అర్థం అవుతున్నదని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్స్ విడుదల చేసే విషయంలో రాజకీయ ఉద్దేశాలతో చూడడం సరికాదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. తెలంగాణలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆర్థిక దిగ్బంధంలో ఉన్నది నిజమేనా? అంటే అవుననే అంటున్నాయి కాగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ఆదాయం ఖర్చుల వివరాలు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తెలంగాణ స్టేట్ అకౌంట్స్ రిపోర్ట్‌ను కాగ్ తన వెబ్ సైట్‌లో పొందుపరిచింది. ఇందులో మార్చి నెలలో వచ్చిన ఆదాయం, ఖర్చులతో పాటు ఏడాదిపాటు వచ్చిన ఆదాయం, ఖర్చుల వివరాలను అందులో పేర్కొన్నది. ఆ వివరాలను పరిశీలిస్తే.. రేవంత్ సర్కారు పెను ఆర్థిక దిగ్బంధంలో ఉన్నదనే అభిప్రాయం బలపడుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన అంచనాలకూ, వచ్చిన ఆదాయానికీ ఆస్మాన్ జమీన్ ఫరక్ ఉంది. వివిధ పన్నుల ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.1,64,397.64 కోట్ల ఆదాయం వస్తుందనుకుంటే.. రూ.1,36,283.47 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇందులోనూ కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన పన్నుల్లో వాటాతో పాటు కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ కూడా కలిసే ఉండటం గమనార్హం. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం దారుణంగా పడిపోయింది. ఇది స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయంపై గణనీయంగా ప్రభావం చూపింది. రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.18,228.82 కోట్లు వస్తుందని భావిస్తే.. వచ్చింది రూ.8,473 కోట్లే. అంటే 46.48 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది. 2023-2024 సంవత్సరంలో 77.27 శాతం ఆదాయం రాగా, ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయం అంతంత మాత్రమే. లిక్కర్ ఆదాయం రూ. 25 వేల కోట్లు వస్తుందనుకుంటే వచ్చింది రూ.18 వేల కోట్లే. నాన్ ట్యాక్స్ రెవెన్యూ (భూముల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం కూడా రూ.12 వేల కోట్ల వరకూ తగ్గింది. ఎక్కడా ప్రభుత్వ భూములు అమ్మే పరిస్థితి కూడా రేవంత్ సర్కారుకు రావడం లేదు. గత ప్రభుత్వంలో అమ్మిన భూముల బకాయిలే వసూలు అవుతున్నట్లు కనిపిస్తున్నది.

గ్రాంట్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నకేంద్రం

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మింగుడు పడటం లేదన్నట్టు పరిస్థితి కనిపిస్తున్నది. దేశంలో కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీయాలన్న నిర్ణయంతో ఉన్న ప్రధాని మోదీ.. తెలంగాణ సర్కారును ఆర్థికపరంగా ఇబ్బందికి గురి చేస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వివిధ పథకాల ద్వారా రాష్ట్రానికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కంట్రిబ్యూషన్స్ రూ.21,636 కోట్లు ఇవ్వాల్సి ఉండగా రూ.7,913 కోట్లు మాత్రమే కేంద్రం ఇచ్చింది. రేవంత్ సర్కారు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనడంలో ఇదీ ఒక కారణంగా మారిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

అప్పుల కోసం తిప్పలు

రాష్ట్ర సర్కారు రోజువారీ చిల్లర ఖర్చులకు కూడా అప్పుల కోసం చూస్తోంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల అప్పులు చేశామని చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో ఉన్న పరిస్థితి చూస్తే ఎక్కడా అప్పు పుట్టడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చేతులెత్తేసిన విషయం తెలిసిందే. గతేడాది బడ్జెట్ అప్పు రూ.48,322 కోట్లు చేశారు. బడ్జెటేతర అప్పులు ఎంత ఉన్నాయనే వివరాలు కాగ్ వెబ్‌సైట్‌లో వెల్లడించలేదు. బడ్జెట్ ఆమోదం పొందిన అప్పులతో కలిపి రాష్ట్రానికి రూ. 2,74,057 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తే వాస్తవంగా వచ్చిన ఆదాయం అప్పులతో కలిపి రూ.217,651 కోట్లు మాత్రమే. 2023-24 వార్షిక ఆదాయం కన్నా 2024-25 వార్షిక ఆదాయం 5 శాతం తగ్గింది.

తెచ్చిన అప్పులు మిత్తీ చెల్లింపులకేనా!

రాష్ట్రం అప్పుల కుప్పగా మారడంతో తెచ్చిన అప్పుల్లో సగానికి పైగా వడ్డీలు చెల్లించడానికే సరిపోతున్నట్టు కాగ్ రిపోర్ట్ ద్వారా తెలుస్తున్నది. మార్చి 31 నాటికి ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 2023 డిసెంబర్ నాటి వరకు తెచ్చిన అప్పులకు వడ్డీల కింద రూ. 26,688 కోట్లు రేవంత్ సర్కార్ చెల్లించింది. బడ్జెట్‌లో వడ్డీల కింద రూ.17,729 కోట్లు చెల్లించాలని పెట్టినా అధిక వడ్డీల భారం కారణంగా రూ. 26 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చి ఉంటుందని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. ఇది గత ఏడాది కంటే 46 శాతం అదనపు చెల్లింపులని కాగ్ రిపోర్ట్ స్పష్టం చేస్తున్నది. తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లింపులే ఎక్కువ కావడంతో అసలు చెల్లింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ముగిసిన ఏడాదిలో తెచ్చిన అప్పుల్లో అసలు కింద రూ.19,626 కోట్లు చెల్లించాలని రేవంత్ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నా.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వాస్తవంగా చెల్లించింది రూ.4855 కోట్లు మాత్రమే. ఆదాయం లేక, కేంద్రం నుంచి గ్రాంట్స్ సరిగా రాక పోవడంతో ఆర్థిక దిగ్బంధంలో రేవంత్ సర్కారు ఉన్నట్లు అర్థం అవుతున్నదని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్స్ విడుదల చేసే విషయంలో రాజకీయ ఉద్దేశాలతో చూడడం సరికాదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, కానీ పరిపాలన సమయంలో కాదని వ్యాఖ్యానిస్తున్నారు. మోదీ సర్కారు తెలంగాణకు ఇతోధికంగా గ్రాంట్స్ విడుదల చేయాలని, పన్నుల్లో వాటా కూడా పెంచాలని కోరుతున్నారు.

# ధైర్యంగా పనిచేయండి..మీ వెంటే నేను ఉంటానన్న పరిటాల శ్రీరామ్

అనంతపురం,తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పరిటాల శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజవర్గం మినీ మహానాడులో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు అర చెయ్యే ఆయుధం అవుతుందన్నారు.. సమయం మించి పోలేదు.. ఇంకా నాలుగేళ్ల సమయం ఉందంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. ధర్మవరం నాకు చాలా ఓపిక నేర్పించిందన్న ఆయన.. కానీ, నాలో ఉన్న ఒరిజనల్ అలానే ఉందన్నారు.. పొద్దు మునగాలంటేనే సమయం పడుతుంది.. ఎందుకు మీరు డీలా పడిపోతున్నారు..? అని ప్రశ్నించారు.. మీరు తప్పి చేసినా, ఒప్పు చేసినా మీ వెంటే ఉంటాను.. నా వెంట నడిచిన వచ్చిన వారినెవర్ని మర్చిపోలేదు అంటూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.. ఎవర్ని చూసో భయపడాల్సిన పని లేదు.. గ్రామాల్లో ధైర్యంగా పనిచేయండి అంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.. టీడీపీ సీనియర్ నేత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్.. కాగా, గత ఎన్నికల్లో ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగాలని బావించారు పరిటాల శ్రీరామ్.. ఆ నియోజకవర్గంపై కేంద్రీకరించి పనిచేశారు.. అయితే, కూటమి పొత్తుల్లో భాగంగా.. ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు చంద్రబాబు నాయుడు.. దీంతో, ఆ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ- చేసిన సత్యకుమార్ యాదవ్.. విజయం సాధించారు.. ఆ తర్వాత చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి పదవి కూడా

# లిక్కర్ స్కామ్‌లో జగన్‌పై నిందలు

అమరావతి,ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో వైఎస్ జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత శైలజానాథ్ మండిపడ్డారు.. సీఎం చంద్రబాబు అధికార దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించిన ఆయన.. జగన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మద్యం అక్రమాలపై ఆధారాలు చూపాలని వైఎస్ జగన్ సవాల్ చేశారు.. దీనిపై ఏమీ సమాధానం చెప్పలేక టీడీపీ నేతలు చేతులు ఎత్తేశారని సెటైర్లు వేశారు.. నిజంగా డేటా డిలిట్ చేస్తే దాని వెనుక మొత్తం డిపార్ట్‌మెంట్ ఉన్నట్టే కదా..? అని ప్రశ్నించారు. ఆధారాల్లేవని ఒకవైపు చెప్తూనే మరోవైపు బ్యాక్‌ఎండ్ లో ఉన్నాయని రాశారు. అంటే బ్యాక్‌ఎండ్‌లో మీకు కావాల్సినట్టు ఆధారాలు తయారు చేస్తున్నారనే అనుమానం కలుగుతోందన్నారు. మద్యం కేసులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి ఒక్కొక్కరు ఒక్కో రీతిలో ఆరోపణలు చేశారని శైలజానాథ్ ఫైర్ అయ్యారు.. నిజంగా అక్రమాలు జరిగి ఉంటే బేవరేజ్ కార్పొరేషన్ అధికారులందరి మీదా ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. డిస్టలరీల మీద కూడా కేసులు పెట్టి ఎందుకు విచారణ చేయలేదు..? అని నిలదీశారు. ఆధారాలు లేకుండా కట్టుకథలు చెప్పటం మానాలని సూచించారు. ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు జనాన్ని మోసం చేసినందునే వచ్చే నెల 4వ తేదీన వెన్నుపోటు- దినాన్ని నిర్వహిస్తున్నాం అని ప్రకటించారు. నిన్నటి ప్రెస్‌మీట్ లో జగన్ వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# మునిగిపోతున్న నావ..వైకాపా

భీమవరం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ.. వచ్చే ఎన్నికలలో ఆ పార్టీకి ఆరు సీట్లు- కూడా రావన్న భయం వైసీపీ నేతలకు పట్టుకుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు కంటే ఏపీ లిక్కర్స్ స్కాం కేసు చాలా పెద్దదని ఆరోపించారు.. మభ్యపెట్టడం మాయ చేయడం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నైజమని దుయ్యబట్టారు.. రైతులు, వ్యవసాయం గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదని మండిపడ్డారు. ఇరిగేషన్ వ్యవస్థ ను భ్రష్టు పట్టించిన చరిత్ర వైసీపీదే అన్నారు.. త్వరలో గోదావరి జిల్లాలో ఇరిగేషన్ వ్యవస్థను ఆధునికరిస్తామని వెల్లడించారు.. రాడార్ తో సర్వే చేసి డీపీఆర్ రిపోర్టులు సిద్ధం చేస్తున్నాం.. కూటమి ప్రభుత్వం రైతుల పక్ష పాత ప్రభుత్వం ధాన్యం కొని 48 గంటల్లో రైతులు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నాం అన్నారు.. నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలో డ్రైన్ తవ్వక పనులకు శంకుస్థాపన చేసిన ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను వెల్లడిస్తూ.. గత ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు..

# సంకేతమదేనా?

కడప:తెలుగుదేశంపార్టీ ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు కడపలో నిర్వహించనున్న పార్టీ పండుగ మహానాడులో తెలంగాణ పార్టీ నేతలకు సముచిత స్థానం ఇచ్చింది. మహానాడు కోసం వేసిన 19 కమిటీలలోనూ తెలంగాణ తెలుగుదేశం నేతలకు స్థానం కల్పించింది. అంతే కాకుండా తెలంగాణ అంశాలపై కూడా ఈ మహానాడులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చే విషయంలో పార్టీ అధినేత చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెబుతున్నారు. తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని, తీసుకొస్తానని చంద్రబాబు ఇప్పటికే పలు సార్లు బహిరంగంగా ప్రకటించారు. రాష్ట్రంలో పార్టీ క్యాడర్ చాలా బలంగా ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాలను ముందుండి నిర్వహించే నాయకులకే కొరత ఉందన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మహానాడులో తెలంగాణలో పార్టీ పటిష్టతపై కూడా చర్చించే అవకాశం ఉందని అంటున్నారు. అందులో భాగంగానే మహానాడు కమిటీల్లో తెలంగాణ పార్టీ నేతలకు చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చారంటున్నారు. మహానాడు ఆహ్వాన కమిటీలో తెలంగాణ మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు, తీర్మానాల కమిటీలో నన్నూరి నర్సిరెడ్డి, చిలువేరు కాశీనాథ్, సామ భూపాల్ రెడ్డికి స్థానం కల్పించారు. అలాగే వసతుల కమిటీలో పార్టీ క్రమశిక్షణ సంఘం సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, సనగాల సాంబశివరావు, షేక్ అరిఫ్ లకు, మహానాడు వేదిక కమిటీలో నందమూరి సుహాసిని, నన్నూరి నర్సిరెడ్డికి అవకాశమిచ్చారు. భోజనాల కమిటీలో కూరపాటి వెంకటేశ్వర్లు, బండి పుల్లయ్య, అజ్మీరా రాజునాయక్, జనగాం నర్సింగరావు సభ్యులుగా ఉన్నారు. సోషల్ మీడియా కమిటీలో తెలంగాణ తెలుగుదేశం నేతలు తిరునగిరి జ్యోత్స్న, కాట్రగడ్డ ప్రసూన, ప్రకాష్ రెడ్డి, ఆర్థిక వనరుల కమిటీలో గడ్డి పద్మావతి, నెల్లూరి దుర్గాప్రసాద్ కు చోటుకల్పించారు. వీళ్ళే కాకుండా ఇంకా అనేక కమిటీల్లో తెలంగాణ నేతలకు చంద్రబాబు అవకాశాలు కల్పించారు. అవకాశాలు కల్పించటమే కాకుండా తెలంగాణలో పార్టీ బలోపేతానికి మహానాడులో తీర్మానాలు కూడా చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లోను సభ్యత్వ నమోదు కార్యక్రమం నిరాఘాటంగా జరుగుతునే ఉంది. పార్టీవర్గాల సమాచారం ప్రకారం తెలంగాణ తెలుగుదేశం పార్టీకి దాదాపు 4 లక్షల సభ్యత్వాలున్నాయి. కడపలో మహానాడు తర్వాత ఇక జాప్యం లేకుండా తెలంగాణలో పార్టీ పటిష్ఠతకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు గట్టిగా నిర్ణయించుకున్నారంటున్నారు. తెలంగాణలో ఎంపికచేసిన నియోజకవర్గాల్లో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీకి గట్టి పట్టు ఉన్న రంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో ఎంపిక చేసిన నియోజకవర్గాలలో ఈ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిం చాలని చంద్రబాబు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని తెలుగుతమ్ముళ్లు చెబుతున్నారు.

# నేనూ ఈడి బాధితుడినే

ముంబయి,ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడి బాధితుల్లో తానూ ఉన్నానని శివసేన ఎంపి సంజయ్ రౌత్ అన్నారు. బిజెపి మరియు ప్రధాని మోడీల ఆయుధమని రౌత్ వ్యాఖ్యానించారు. తన నివాసంపై కూడా ఈడి దాడులు నిర్వహించిందని, తాను ఈడి బాధితుడినని అన్నారు. తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రాష్ట్ర మార్కెటింగ్ కార్పోరేషన్ (టిఎఎస్ఎంఎసి)పై మనీలాండరింగ్‌కు సంబంధించి ఈడి దర్యాప్తును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కేంద్ర ఏజన్సీ అన్ని పరిధులను దాటుతోందని, సమాఖ్య నిర్మాణాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై శుక్రవారం సంజరురౌత్ మీడియాతో మాట్లాడారు. 'సుప్రీం పేర్కొన్నట్లు ఈడి అన్ని హద్దులను దాటుతోంది. నేను కూడా ఈడి బాధితుడినే. నాలాంటి వారు చాలామంది ఉన్నారు. ఈడి అనేది బిజెపి, ప్రధాని, అమిత్‌షాల ఆయుధం. ఈడి ఉన్నంత కాలం మోడీ-షాల ద్వయం, బిజెపి ఉంటాయి' అని అన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్‌ని రాహుల్ గాంధీ ప్రశ్నించడంపై కూడా సంజయ్ రౌత్ స్పందించారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలో తప్పు లేదని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. రాహుల్ మాత్రమే కాదు దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు తెలుసుకోవాల్సి ఉందని అన్నారు.

# కవిత మరో షర్మిల..?



హైదరాబాద్,కవిత లేఖ కారు పార్టీలో కలకలం రేపుతోంది. తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. కవిత స్థాయి నేత.. తండ్రికి లేఖ రాస్తే.. అది ఎలా బయటకు వచ్చింది? లెటర్ ఎలా లీక్ అయింది? ఎవరు లీక్ చేశారు? సరిగ్గా కవిత విదేశాల్లో ఉన్న సమయంలోనే లేఖ వైరల్ కావడం వెనుక వ్యూహం ఉందా? కవిత వేరు కుంపటి కన్ఫామా? బీఆర్ఎస్, బీజేపీల పొత్తు ఉంటుందా? ఇలా తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేలా ఉంది కవిత గొడవ.

తెలంగాణలో కవిత కాక..

కవితది రాజకీయ పంచాయితీనా? ఆస్తుల పంచాయితీనా? అంటూ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించడం ఆసక్తికరంగా మారింది. కవితను బయటకు పంపించడం కోసం బావా, బామ్మర్దులు ఒక్కటి అయ్యారన్నారు. కవిత మరో షర్మిల కాబోతున్నట్టుగా కనిపిస్తున్నదని అన్నారు. రఘునందన్ చేసిన కామెంట్స్‌పై జోరుగా చర్చ నడుస్తోంది.

షర్మిలలానే కవిత..?

రఘునందన్‌రావు అంచనా వాస్తవికంగానే ఉందని అంటున్నారు. కవిత మరో షర్మిల అవుతుందని మాట్లాడుకుంటున్నారు. జగనన్నతో షర్మిలకు విభేదాలు వచ్చాయి. పార్టీ కోసం వాడేసుకుని.. గెలిచాక పక్కనపెట్టేశారంటూ చెల్లి మండిపడింది. ఆస్తులు సరిగ్గా పంచకుండా తనకు అన్యాయం చేశారంటూ అన్నతో గొడవ పెట్టుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటూ వేరు కుంపటి పెట్టుకుంది. కొంతకాలం బాగానే ట్రై చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో కలిపేశారు. ఏపీ పీసీసీ చీఫ్ అయ్యారు. కవిత ఎపిసోడ్ సైతం షర్మిల స్టోరీతో సరిపోలుతోందని విశ్లేషిస్తున్నారు.

కవితకు పొగ పెట్టేశారా?

కల్వకుంట్ల కుటుంబంలో సైతం కుంపటి రాజుకుందని అంటున్నారు. జైలు నుంచి వచ్చాక కవిత పార్టీకి దూరంగా ఉంటున్నారు. పార్టీయే ఆమెను దూరం పెట్టిందనే టాక్ కూడా ఉంది. జాగృతి జెండా కిందనే యాక్టివ్ పాలిటిక్స్ చేస్తున్నారు కవిత. బీసీ నినాదం ఎత్తుకున్నారు. పూలే విగ్రహం కోసం పట్టుబడుతున్నారు. సామాజిక తెలంగాణ రావాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇవన్నీ బీఆర్ఎస్‌కు ఇబ్బంది కలిగించే స్ట్రాటజీలే అంటున్నారు. చెల్లి ఎత్తుగడలు పసిగట్టిన కేటీఆర్.. ఇటీవల బావ హరీశ్‌రావుతో వరుస మీటింగ్‌లు జరిపారని అంటున్నారు. కవిత పార్టీని వీడితే సరే.. లేదంటే వాళ్లే వెళ్లగొట్టేలా ఉన్నారని తెలుస్తోంది. అందుకే, ఇటీవల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలు జైల్లో ఉండొచ్చా.. ఇంకా తనను కష్టపెడతారా? తనపై కుట్ర చేస్తుంది ఎవరో తెలుసు.. రెచ్చగొడితే మరింత రెచ్చిపోతా.. అంటూ ఇన్‌డైరెక్ట్‌గా కేటీఆర్ టార్గెట్‌గా హాట్ కామెంట్స్ చేశారని అంటున్నారు.

లేఖ లీక్ చేసింది ఎవరు?

కేటీఆర్, కవిత మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయని చెబుతున్నారు. ఆస్తుల నుంచి రాజకీయ వారసత్వం వరకూ.. సేమ్ టు సేమ్ జగన్ వర్సెస్ షర్మిల వివాదం మాదిరే.. కేటీఆర్ %ఐం% కవిత ఎపిసోడ్ కాక మీదుందని బీఆర్ఎస్ అంతర్గత వర్గాల్లో చర్చ నడుస్తోంది. అన్నను దెబ్బకొట్టేందుకే.. చెల్లి సొంత ఎజెండాతో కలకలం రేపుతున్నారని చెబుతున్నారు. మై డియర్ డాడీ అంటూ బీఆర్ఎస్‌ను కార్నర్ చేసేలా ఉన్న కవిత రాసిన లేఖ సైతం అందులో భాగమేనని అంటున్నారు. లేఖ రాసింది.. లీక్ చేసిందీ కవితనే అనే అనుమానాలు లేకపోలేదు. త్వరలోనే కొత్త పార్టీ పెట్టడం కూడా ఖాయమనే ప్రచారం జరుగుతోంది. మరి, కవిత వేరు కుంపటి ఎవరికి కలిసొస్తుంది? బీజేపీకా? కాంగ్రెస్‌కా? కూతురు గొడవను గులాబీ బాస్ హ్యాండిల్ చేయగలరా?

# కవిత.. షర్మిల.. కనిమొళి.. రాజకీయంలోనూ ఆడబిడ్డ వాటా

హైదరాబాద్,తల్లిదండ్రుల ఆస్తిలో ఆడబిడ్డకు వాటా.. భారతీయుల సంప్రదాయంలో భాగం. ఎంత పేదవారయినా తమ ఇంటి ఆడ పిల్లకు ఎంతో కొంత ఇస్తుంటారు.. ప్రస్తుత కాలంలో ఇది 'రాజకీయం'లోనూ అన్నట్లుగా మారింది. మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి దీనికి అద్దం పడుతోంది. ఇంకా చెప్పాలంటే ప్రాంతీయ పార్టీల్లో ఆడబిడ్డ వాటా గట్టిగా ప్రస్తావనకు వస్తోంది.తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విషయమే నిదర్శనం. పార్టీలో సమ స్థాయిని ఆమె కోరుకుంటున్నారని, ఇంకా ముందుకెళ్లి ప్రత్యామ్నాయంపై కూడా ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. మద్యం కేసులో అరెస్టయిన కవిత గత ఏడాది ఈ సమయంలో ఢిల్లీ తిహాడ్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. తన రాజకీయ భవిష్యత్ ను దెబ్బకొట్టిన బీజేపీపై ఆమె మహా గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తండ్రికి ఆరు పేజీల సుదర్ఘీ లేఖ రాయడం కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ లో తాడోపేడో తేల్చుకునే ఉద్దేశంలో కూడా ఆమె ఉన్నట్లుగా చెబుతున్నారు. అసలు కవిత ఉద్దేశం ఏమిటో బయటపడాల్సి ఉంది. ఏదైనా సరే.. సోదరుడు కేటీఆర్, బావ హరీశ్ రావుతో సమానంగా ఆమె బీఆర్ఎస్ లో స్థాయిని కోరుకుంటున్నట్లు, పార్టీ విధానాలతో ఏకీభవిస్తున్నట్లు లేరని అర్థం అవుతోంది.మూడేళ్ల కిందట ఇదే సమయంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కూడా రాజకీయంగా సొంత అడుగులు వేసిన సంగతి తెలిసిందే. అన్న వైస్ జగన్ అధికారంలో ఉండగా.. అప్పట్లో ఆమె సొంత రాష్ట్రం ఏపీని వదలి తెలంగాణలో పార్టీ పెట్టడం కలకలం రేపింది. ఆ తర్వాత తెలంగాణ ఎన్నికలకు దూరంగా ఉండడం, పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడం ఇతర విషయాలు. రాజకీయ ప్రాధాన్యం విషయంలోనో, ఆర్థిక వివాదాలతోనో షర్మిల తన అన్న జగన్ ను విభేదించి సొంత పార్టీ పెట్టుకున్నారు. ఏపీకి తిరిగివెళ్లి అన్న ఓటమికి పరోక్షంగా



కారణమయ్యారు.మహారాష్ట్రలో తిరుగులేని నాయకుడైన శరద్ పవార్.. ఎన్సీపీ పేరిట సొంత పార్టీని స్థాపించి తన సత్తాచాటారు. అలాంటి శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం.. ఆమెకే పార్టీ పగ్గాలు దక్కుతుందనే వాదనలు వచ్చాయి. చివరకు ఎన్సీపీ వేరే కారణంతో చీలిపోయింది. పెద్ద పవార్ ఎంతో నమ్మకం ఉంచిన తన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ పార్టీని నిలువునా చీల్చేశారు. సుప్రియా ఇప్పుడు ఎంపీగా మిగిలిపోయారు.కొన్నేళ్ల కిందట తమిళనాడులో డీఎంకే అధినేత కరుణానిధి కుటుంబంలో వచ్చిన విభేదాల సంగతి అందరికీ తెలిసే ఉంటుంది. కరుణానిధి కుమారులు అళగిరి, ప్రస్తుత సీఎం స్టాలిన్ లు పార్టీపై పట్టు కోసం ఎత్తుకుపైఎత్తులు వేశారు. వీరి సోదరి కనిమొళి 2జి స్పెక్ట్రం కేసులో జైలుకెళ్లారు. ఇప్పుడు ఆమె తూత్తుకూడి ఎంపీగా ఉన్నారు. అయితే, స్టాలిన్ కుమారుడు, తన మేనల్లుడు ఉదయనిధి స్టాలిన్ డిప్యూటీ సీఎం కావడం కనిమొళికి ఇష్టం లేదని చెబుతున్నారు. దీంతో ఆమె వచ్చే ఏడాది ఎన్నికల నాటికి ఏం చేస్తారో తెలియాల్సి ఉంది.

# కోటాలోనే ఎందుకీ ఆత్మహత్యలు

న్యూఢిల్లీ: రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కోటాలోనే ఇలాంటివి ఎందుకు చోటుచేసుకుంటున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది. కోటా, ఐఐటీ- ఖరగ్‌పుర్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యల కేసులను విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది.ఐఐటీ- ఖరగ్‌పుర్‌కు చెందిన విద్యార్థి (22) ఆత్మహత్యకు సంబంధించిన కేసును సుప్రీం విచారించింది. మే 4న హాస్టల్ గదిలో ఉరివేసుకొని మరణించగా.. పోలీసులు మాత్రం మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదుకు నాలుగు రోజులు ఆలస్యం ఎందుకు అయ్యిందని సంబంధిత పోలీసు అధికారిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులను తేలికగా తీసుకోవద్దని, చాలా తీవ్రత కలిగిన అంశాలని పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు సంబంధించి మార్చి 24న ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన న్యాయస్థానం.. ఇటువంటి కేసుల్లో ఎఫ్ఐఆర్ త్వరగా నమోదుచేయడం ఎంతో ముఖ్యమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పోలీసు అధికారి, ఐఐటీ ఖరగ్‌పుర్ తరఫు న్యాయవాది ఇచ్చిన వివరణలపై సుప్రీం ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. కోటాలో నీట్ కు సన్నద్ధమవుతోన్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం



తప్పుపట్టింది. గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తున్నారని, ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని నిలదీసింది. సంబంధిత పోలీసు అధికారి విధి నిర్వహణలో విఫలమయ్యారని, కోర్టు ఆదేశాలను ఆయన పాటించలేదని పేర్కొంది. దీనిపై జులై 14 సదరు పోలీసు అధికారి హాజరై వివరణ ఇవ్వాలని సమన్లు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారు? కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? ఈ విషయంపై ఎందుకు ఆలోచించడం లేదని రాజస్థాన్ ప్రభుత్వం తరఫు న్యాయవాదిని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు న్యాయవాది బదులిస్తూ.. ఆత్మహత్యల కేసులను పరిశీలించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు- చేశామని చెప్పారు.

# తూటాల్లాంటి మాటలతో.. ఎవరీ అనుపమ?




న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడికి సమాధానంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన విషయం తెలిసిందే! ఈ క్రమంలో పాకిస్థాన్ ఓవైపు మన దేశంపై దాడులు చేస్తూనే.. మరోవైపు తమకేమీ తెలియదంటూ నక్కజిత్తులు ప్రదర్శించింది. ఇలాంటి పాక్ మోసపూరిత వైఖరిని ప్రపంచం ముందు బట్టబయలు చేశారు భారత దౌత్యవేత్త అనుపమా సింగ్. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)' ప్రధాన కార్యాలయంలో తాజాగా జరిగిన ఓ సమావేశంలో పాక్ ఉగ్రవాదంపై గళమెత్తారామె. తూటాల్లాంటి మాటలతో శత్రుదేశంపై విరుచుకుపడ్డారు. ఇలా ఆమె చేసిన ప్రసంగం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంతకీ ఎవరీ అనుపమ? తెలుసుకుందాం రండి..

ఉగ్రవాదాన్ని అంతం చేయాలని!

'పాకిస్థాన్ ఉగ్రవాదానికి కేంద్రంగా మారింది. అయినా తామే ఇందుకు బాధితులమంటూ నటిస్తోంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడమే కాదు.. దీని ద్వారా ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. పాక్‌లో శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఏప్రిల్ 22న పహల్గాంపై జరిపిన దాడిలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ సభ్యుల కళ్లెదుటే వాళ్లను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. ఇలాంటి ఉగ్రవాదుల్ని మట్టుబెట్టి, వారి స్థావరాల్ని నేలమట్టం చేయడానికే భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ క్రమంలో ఆ దేశంలోని సామాన్య పౌరులకు ఎలాంటి నష్టం, ప్రాణహాని జరగకుండా అన్ని చర్యలూ తీసుకున్నాం. ఇలా ఉగ్రదాడులకు తెగబడడమే కాదు.. సింధూ జలాల ఒప్పందం పైనా కట్టుకథలు అల్లుతోంది.. దీనిపై తప్పుడు కథనాలు ప్రచారం చేస్తోంది.. ఈ అంశాన్ని మరింత సంక్లిష్టం చేయాలని చూస్తోంది..' అంటూ పాక్ నక్కజిత్తుల్ని ప్రపంచ దేశాలకు తెలియజేశారు అనుపమ. ఈ సందర్భంగా ఆమె చేసిన ప్రసంగం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో పలువురు అనుపమ స్పీచ్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలా ఇప్పుడే కాదు.. గతేడాది మార్చిలో 'ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి ' వేదికగా జరిగిన ఓ సదస్సులోనూ.. జమ్మూకశ్మీర్‌పై పాక్ చేసిన ఆరోపణల్ని తనదైన ప్రసంగంతో తిప్పి కొట్టారామె. అప్పుడూ ఆమె స్పీచ్ నెట్టింట్లో వైరలైంది.

కార్పొరేట్ ఉద్యోగాన్ని కాదని!

దిల్లీకి చెందిన అనుపమ చిన్నతనం నుంచి చదువు, ఇతర వ్యాపకాల్లో చురుగ్గా ఉండేది. సివిల్స్ చదవాలని, దేశానికి సేవ చేయాలని చిన్నతనంలోనే సంకల్పించుకున్న ఆమె.. తొలుత బీటెక్ పూర్తిచేసింది. చదువు పూర్తికాగానే ఓ కార్పొరేట్ సంస్థలో కన్సల్టెంట్‌గా చేరిన ఆమె.. తనదైన పనితీరుతో అనతి కాలంలోనే సీనియర్ కన్సల్టెంట్‌గా పదోన్నతి పొందింది. నిజానికి ఆమె అంతిమ లక్ష్యం ఇది కాదు.. ఈ క్రమంలోనే తన కార్పొరేట్ ఉద్యోగానికి రాజీనామా చేసి.. యూపీఎస్సీకి సన్నద్ధమవడం ప్రారంభించింది. 2014లో తన కలను నిజం చేసుకున్న అనుపమ.. అదే ఏడాది 'లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్'లో శిక్షణ పొందింది. గత తొమ్మిదేళ్లుగా 'భారత విదేశాంగ శాఖ'లో దౌత్యవేత్తగా పనిచేస్తోన్న ఆమె.. తనదైన పనితీరు, ప్రసంగాలతో ఎప్పటికప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఫైనాన్స్ విభాగంలో ఎంబీఏ పట్టా కూడా అందుకున్న అనుపమ.. సివిల్స్‌లో చేరకముందు 'ఛార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్' ప్రోగ్రామ్ పూర్తిచేసింది. కార్పొరేట్ ఫైనాన్స్, వాల్యుయేషన్, పోర్ట్‌ఫోలియోల నిర్వహణ.. వంటి అంశాల్లో అనుపమకు పట్టుంది.

# జగిత్యాల అంటే భయపడుతున్న మంత్రులు..




జగిత్యాల:సహజంగా అధికార అంటే ఆధిపత్యపోరు, విబేధాలు పెద్దగా కనిపించవు. ఒక వేళా ఉన్నా అవి బయటకు రావు. పార్టీ పెద్దల బుజ్జగింపులతోనో? ఇంకో రకంగానో సర్దుకపోతుంటారు. అయితే అందుకు బిన్నంగా ఉంది జగిత్యాల నియోజకవర్గం పరిస్థితి. అక్కడ అధికార కాంగ్రెస్‌లో విబేధాలు రోజురోజుకు రచ్చకెక్కుతున్నాయి. ఇద్దరు ముఖ్య నేతలు సంజయ్, జీవన్‌రెడ్డిలు విమర్శలు, ప్రతి విమర్శలతో చెలరేగిపోతున్నారు. ఆ ఇద్దరు తగ్గేదేలేదంటూ మాటల యుద్ధం కొనసాగిస్తుండటంతో కాంగ్రెస్ క్యాడర్ అయోమయానికి గురవుతోందంట. అసలు జగిత్యాల కాంగ్రెస్‌లో ఆ పరిస్థితికి కారణమేంటి?

జగిత్యాల కాంగ్రెస్‌లో సంజయ్, జీవన్‌రెడ్డిల మధ్య విబేధాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాలు అధిష్టానానికి తలనొప్పిగా మారిపోయాయి. అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విబేధాలు మరింత ముదిరిపోయాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో.. ఇక్కడ కాంగ్రెస్ నుంచి జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచీ సంజయకుమార్ పోటీ చేశారు. సంజయ్ కుమార్ వరుసగా రెండో సారి జీవన్‌రెడ్డిపై విజయం సాధించారు. జీవన్ రెడ్డి ఓడిపోయినా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తనకే ప్రాధాన్యత ఉంటుందని అప్పటికి ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి భావించారు.

కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంజయ్‌కుమార్

తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలోసంజయ్ కుమార్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచీ జీవన్‌రెడ్డి తన విమర్శలకు పదును పెట్టారు. ఆరంభంలోనే సంజయకుమార్ రాకను తీవ్రంగా వ్యతిరేకించడంతో కాంగ్రెస్ హైకమాండ్ ఢిల్లీ పిలిపించి పంచాయతీ పెట్టి బుజ్జగించాల్సి వచ్చింది. అయినా ఇప్పటికీ జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేకి యాంటీగానే ఉన్నారు. ఎన్నో సార్లు పార్టీ పెద్దల బుజ్జగించినా ఈ సీనియర్ నేత.. అదే ధోరణితో ముందుకు వెళున్నారు. ఇప్పుడు మరోసారి ఆ ఇద్దరు విమర్శలు చేసుకుంటున్నారు.

సంజయ్ కాంగ్రెస్‌లో ఉన్న విషయం జీవన్‌కి తెలియదంట

సంజయ్‌కుమార్‌ను ఉద్దేశించి.. ఆయన కాంగ్రెస్ లో ఉన్న విషయం తెలియదని.. పార్టీ మారడం తనకు నచ్చదని జీవన్‌రెడ్డి మళ్లీ మాటల యుద్ధం మొదలుపెట్టారు. అధిష్టానంపై కూడా ఫైర్ అవుతున్నారు. జీవన్‌రెడ్డి వైఖరితో జగిత్యాల జిల్లాకు మంత్రులు రావాలంటే భయపడుతున్నారంట. ఇటీవల.. జగిత్యాల జిల్లాకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. జీవన్‌రెడ్డి వినతి పత్రం ఇచ్చిన తరువాత.. శ్రీనివాస్ రెడ్డి ఆయన్ని ఆలింగనం చేసుకునే ప్రయత్నం చేశారు. కానీ జీవన్‌రెడ్డి వెనక్కి వెళ్లిపోయారు. ఆ విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దాంతో మిగతా మంత్రులు కూడా జగిత్యాల పర్యటనకు రావాడానికి ఒక్కటిక రెండు సార్లు ఆలోచిస్తున్నారంట.

ప్రతి విమర్శలు మొదలుపెట్టిన సంజయ్ కూమార్

జీవన్‌రెడ్డి ఏదో ఒక్క సంచలన కామెంట్ చేస్తూనే వస్తున్నారు. అధికార పార్టీని ఇరుకునే పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్వపక్షంలో ఉండి ప్రతిపక్ష పాత్రను పోషిస్తున్నారు. ఇన్ని రోజులు సైలెంట్గా ఉన్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా ఇప్పుడు ప్రతి విమర్శలు చేస్తున్నారు. అత్యధిక సార్లు ఓడిపోయిన జీవన్‌రెడ్డి అని యద్దేవా చేశారు. జీవన్‌రెడ్డి కూడా గతంలో పార్టీ మారారని గుర్తు చేస్తున్నారు. జగిత్యాలకు చెందిన ఈ ఇద్దరు నేతల మధ్య గిల్లిగజ్జాలు కొనసాగుతూనే ఉండటంతో క్యాడర్ తలలు పట్టుకుంటోంది. ఏ నేత దగ్గరికి వెళ్లాలో అర్థం కావడం లేదని వాపోతోంది.

విభేదాలపై సైలెంట్‌గా ఉంటున్న అధిష్టానం

జగిత్యాల కాంగ్రెస్‌లో రోజు.. రోజుకు విబేధాలు పెరుగుతున్నా.. అధిష్టానం మాత్రం సైలెంట్‌గా ఉంటుంది. ఎలాంటి జోక్యం చేసుకోవడం లేదు. పార్టీ మారిన సంజయ్‌కుమార్‌కి .. ఈ వ్యవహారాలన్నీ తలనొప్పిగా మారుతున్నాయంట. ఆ ఇద్దరు నేతలు అలా కొట్టుకుంటుంటే.. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ క్యాడర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మరి కాంగ్రెస్ పెద్దలు వారి పంచాయితీకి ఎలా ఫుల్‌స్టాప్ పెడతారో చూడాలి.

## కేంద్రానికి భారీగా డివిడెండ్

ముంబై,కేంద్రంలోని మోదీ సర్కారుకి ఆర్‌బిఐ భారీగా నజరానా ఇస్తోంది. ఏకంగా కేంద్ర ప్రభుత్వానికి రూ. 2.69 లక్షల కోట్ల డివిడెండ్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇవ్వబోతోంది. 2025 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ 2.69 లక్షల కోట్ల రూపాయల రికార్డు డివిడెండ్‌ను చెల్లించనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్రానికి రూ. 2,68,590.07 కోట్ల మిగులును బదిలీ చేయడానికి శుక్రవారం ఆమోదం తెలిపింది. కాగా, ఇటీవల కేంద్రం ప్రకటించిన యూనియన్ బడ్జెట్‌లో ఆర్‌బీఐ సహా ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో కేంద్ర ఖజానాకు రూ.2.56 లక్షల కోట్లు సమకూరుతాయని కేంద్ర

# జగన్ అలా.. రేవంత్ ఇలా.. ఇద్దరి మధ్య తేడా ఇదేనా?

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవహారశైలిపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి హోదాలో నాంపల్లి కోర్టుకు హాజరైన రేవంత్ రెడ్డి తనపై నమోదైన కేసులపై వాంగ్మూలమిచ్చారు. ఈ కేసులు, తీర్పులు ఎలా ఉన్నా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో కోర్టుకు రావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇదే సమయంలో వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి కోర్టు కేసులు, ఇతరత్రా విషయాలపై చర్చ జరుగుతోంది.ముఖ్యమంత్రి కాకముందు నుంచి వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిపై ఎన్నో కేసులు ఉన్నాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రాకముందు ఆయన ప్రతి శుక్రవారం హైదరాబాదులోని సీబీఐ కోర్టుకు హాజరయ్యేవారు. ఎన్నికల ప్రచారం, పాదయాత్ర సమయంలో మాత్రం కోర్టు అనుమతితో మినహాయింపు పొందేవారు. అయితే ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ప్రతివారం కోర్టుకు హాజరవుతారా? అనేది పెద్ద చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి హోదాలో ఆయన కోర్టుకు హాజరైతే భద్రత నిమిత్తం రోజుకు సుమారు రూ.60 లక్షలు వరకు ఖర్చు అవుతుందని అప్పట్లో కోర్టుకు నివేదించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి విధుల్లో బిజీగా ఉన్నందున తనకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఐదేళ్లలో ఒక్కనాడు కోర్టు గుమ్మం ఎక్కకుండా తప్పించుకున్నారని గుర్తు చేస్తున్నారు.అదేవిధంగా 2019 ఎన్నికల ముందు వైసీపీ అధినేత జగన్ పై విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో దాడి జరిగింది. ఈ కేసులో జనిపల్లి శ్రీనివాసరావు అనే యువకుడిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఈ కేసులో సాక్ష్యం చెప్పాల్సిన జగన్ ఎన్ని నోటీసులిచ్చినా కోర్టుకు హాజరవ్వలేదు. ఏదో ఒక కారణం చూపి ఆయన సాక్ష్యం చెప్పకుండా తిరిగేవారని విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో జగన్ వ్యవహారశైలిపై నిందితుడు కుటుంబంతోపాటు పౌర హక్కుల నేతలు, న్యాయవాదులు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జగన్ ఒక్కసారి కోర్టుకు రావాల్సిందిగా వేడుకున్నారు. కానీ, ఆయన ఏనాడూ కోర్టు మెట్లు ఎక్కేందుకు ఇష్టపడలేదు. తాను ముఖ్యమంత్రి హోదాలో ఉండగా, కోర్టుకు వెళ్లి బోనులో నిల్చొవడమేంటన్న ఆలోచనతో జగన్.. కోర్టు విచారణకు దూరం ఉండేందుకు ఇష్టపడేవారని చెబుతున్నారు. ప్రతిపక్షాలు సైతం ఇవే తరహా విమర్శలు చేసేవి..ఇక ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం జగన్ కు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరికీ సంబంధం లేకపోయినా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా పనిచేసిన నేతల మధ్య సారూపత్యాలు, భిన్న



వ్యక్తిత్వాలపై తరచూ చర్చ జరుగుతుంటుంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి గురువారం నాంపల్లి కోర్టులో ప్రత్యక్షమవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలపై అప్పటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసులో తన తప్పులేదని చెప్పుకునేందుకు ఆయన కోర్టుకు వచ్చారు. రేవంత్ పైనా ఓటుకు నోటు వంటి కేసులు పెండింగులో ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వం పెట్టిన ఇలాంటి కేసుల్లోనూ ఆయన విచారణ ఎదుర్కొంటున్నారు. కోర్టులను గౌరవించి న్యాయమూర్తుల ముందు హాజరవుతున్నారని కాంగ్రెస్ చెప్పుకుంటోంది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి హోదాలో జగన్ వ్యవహరించిన తీరు చర్చకు తావిస్తోంది.

## రూ.200 కోట్లు విలువ చేసే స్థలం కబ్జా

హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లో దాదాపు రూ.200 కోట్లు విలువ చేసే రెండెకరాల పార్క్ స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. ప్రభుత్వ స్థలాలన్ని కబ్జాచేయడమే గాకుండా తనదే స్థలం అంటూ సుప్రీం దాకా వెళ్లగా కోర్టు దానిని తిరస్కరించింది.దీంతో హైడ్రా రంగప్రవేశం చేసి స్థలంలో ఉన్న కట్టడాలను కూల్చేసి దానిని కాపాడింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41 పెద్దమ్మగుడి సమీపంలో నాలాతో పాటు పార్క్ రహదారిని ఆక్రమించి నిర్మించిన భవనాలను హైడ్రా సిబ్బంది శుక్రవారం నేలమట్టం చేసింది. ఇంటిని అద్దెకు తీసుకొని ఆ ఇంటి యజమానికి తెలియకుండా చుట్టూ ఉన్న ప్రభుత్వ, ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ఆక్రమించిన కబ్జాదారుడు..

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com